గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
GAUTHAM NEWS
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సీ ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.

# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక




హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 228, ఎడిటర్,భీముడు నాయక్ పేజీలు : 12, వెల రూ. 1, గురువారం - 26 - సెప్టెంబర్ - 2024
PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## ఇజ్రాయెల్ భీకర దాడుల్లో 356 మంది మృతి

1000 మంది పైగా తీవ్ర గాయాలపాలు

హిజ్బుల్లా అడ్డాలే లక్ష్యంగా దూకుడు

300కు పైగా లక్ష్యాలపై రాకెట్ల వర్షం

వేలాది వాహనాల్లో తరలిపోయిన ప్రజలు

మరో గాజాలా లెబనాన్



### ఉక్రెయిన్ ప్రెసిడెంట్ జెలెన్స్కీతో
## సమావేశమైన ప్రధాని మోదీ

రష్యా, ఉక్రెయిన్ మధ్య వివాదం..

నెల రోజుల వ్యవధిలో ఇరువురు నేతల మధ్య ఇది రెండో సమావేశం



## దేశంలో తొలి క్లేడ్ 1బీ మంకీపాక్స్ కేసు

ప్రాణాంతక మంకీపాక్స్‌కు సంబంధించి భారత్‌లో మరో కేసు

కేరళలోని మలప్పురం జిల్లాలో ఓ వ్యక్తికి ఈ వ్యాధి నిర్ధారణ

విదేశాల నుంచి తిరిగి వచ్చే వారిలో వ్యాధి లక్షణాలు కనపడితే ఆరోగ్యశాఖకు తెలియజేయాలి



### 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసినా
## నిరుద్యోగ సమస్య పోదు



రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

ప్రతి సంవత్సరం 3 లక్షల మంది పట్టాలు తీసుకొని బయటకు వస్తున్నారన్న సీఎం

ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడినట్లు వెల్లడి

బ్యాంకులు, బీమా రంగాల్లో చాలా ఉద్యోగాలు ఉన్నాయని వెల్లడి

### మూసీ శుద్ధి వెనుక ప్రభుత్వ అస్సలు
# ఉద్దేశం వేరే ఉంది..

- మూసీ సుందరీకరణ పేరుతో వేల కోట్ల కుంభకోణం..
- పబ్లిసిటీ స్టంట్లతో ఎక్కువ రోజులు మాయ చేయలేరు..
- పాకిస్తాన్ కంపెనీలకు మూసీ సుందీకరణ



హైదరాబాద్ : హైదరాబాద్ మహా నగరాన్ని ఒక విశ్వనగరంగా తీర్చిదిద్దాలనే దృఢ కసంకల్పంతో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నేతృత్వంలో జీహెచ్ఎంసీ పరిధిలో ప్రతి రోజు ఉత్పత్తి అయ్యే 20 కోట్ల లీటర్ల మురికి నీటిని సంపూర్ణంగా శుద్ధి చేయాలనే ఉద్దేశంతో రూ. 4 వేల కోట్లతో 31 ఎస్టీపీలకు శ్రీకారం చుట్టామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఫతేనగర్ ఎస్టీపీని సందర్శించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఇండియాలోనే 100 శాతం సీవరేజ్ ట్రీట్‌మెంట్ చేసే ఏకైక నగరంగా హైదరాబాద్‌ను మార్చాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం తీసుకున్నామని కేటీఆర్ గుర్తు చేశారు. ఇవాళ కూకట్‌పల్లి ఫతేనగర్‌లో ఏర్పాటు చేసిన 133 ఎంఎల్‌డీల ఎస్టీపీ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇది ప్రస్తుతం ట్రయల్ రన్ దశలో ఉంది. ఎస్టీపీల సందర్శనలో ఇది మొదటి అడుగు మాత్రమే.. ఉప్పల్ నల్ల చెరువు, ఎల్‌బీనగర్, కుత్బుల్లాపూర్, రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేస్తున్న ఎస్టీపీలను కూడా త్వరలోనే సందర్శిస్తాం అని కేటీఆర్ పేర్కొన్నారు. మిగతా..2లో

### పిల్లల కోసం నీళ్లు అడిగితే ఇవ్వలేని పరిస్థితి చూశా..



- వరదలపై సీఎం చంద్రబాబు ప్రెస్ మీట్
- తన జీవితంలో అలాంటి విపత్తును ఎన్నడూ చూడలేదన్న చంద్రబాబు
- ఓ పక్క క్లౌడ్ బరస్ట్.. మరోవైపు బుడమేరు వరద
- విపత్తులను హ్యాండిల్ చేయడంలో కొత్త ఒరవడి

### దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా
# ఏపీ అభివృద్ధికి రూట్ మ్యాప్

- చంద్రబాబు నేతృత్వంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా అడుగులు
- దేశంలో ఐదో అతిపెద్ద ఆర్థిక నగరంగా విశాఖపట్నాన్ని తీర్చిదిద్దుతామన్న లోకేశ్
- 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని పిలుపు
- విశాఖలో డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్, అంతర్జాతీయ స్థాయి డేటా సెంటర్



అమరావతి: 2047 నాటికి దేశంలో నెం.1 రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేయడానికి రూట్ మ్యాప్ సిద్ధం చేశామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో విశాఖ నోవాటెల్ హెూటల్‌లో నిర్వహించిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమల స్థాపనకు గల అవకాశాలు, ఆర్థిక వనరులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై నిర్వహించిన సదస్సుకు జాతీయస్థాయి ప్రముఖ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... రాష్టంలో కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి గత ప్రభుత్వ చర్యల కారణంగా అయిదేళ్లుగా స్పీడ్ బ్రేకర్లు పడ్డాయని, అన్నివిధాలా నిర్లక్ష్యానికి గురైన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టడానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు చెప్పారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగవంతంగా ముందుకు సాగుతోందన్నారు.

**అభివృద్ధి వికేంద్రీకరణపై ప్రత్యేక దృష్టి**

చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధి వికేంద్రీకరణపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. అందులో భాగంగా ప్రతి జిల్లాలో ఒక రంగంపై దృష్టి సారించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. కర్నూలు జిల్లాలో రెన్యూవబుల్ ఎనర్జీ అభివృద్ధిపై దృష్టి సారిస్తామని, రాబోయే ఐదేళ్లలో 72 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందులో భాగంగా హైడ్రో, విండ్, సోలార్ విద్యుదుత్పత్తి ప్రాజెక్టులు పెద్ద ఎత్తున అక్కడకు వస్తాయని ఆకాంక్షించారు. అనంతపురం జిల్లాలో ఆటోమొబైల్ మ్యానుఫ్యాక్చరింగ్, చిత్తూరు, కడప జిల్లాల్లో ఎలక్ట్రానిక్స్ ఇండస్ట్రీస్, ప్రకాశం జిల్లాలో బయోఫ్యూయల్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో క్యాపిటల్ రీజియన్, గోదావరి జిల్లాల్లో ఆక్వా ఉత్పత్తుల పరిశ్రమలను అభివృద్ధి చేస్తామన్నారు. రోడ్లు, మౌలిక సదుపాయాలు గత అయిదేళ్లుగా నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. గోదావరి జిల్లాల్లో గ్రీన్ ఎనర్జీ రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. దేశంలోనే అతిపెద్ద పెట్రో కెమికల్ కారిడార్ అక్కడ రాబోతుందన్నారు.

**విశాఖపట్నంలో అంతర్జాతీయ స్థాయి డేటా సెంటర్**

విశాఖపట్నాన్ని ప్రపంచంలోనే నెం. 1 ఐటీ హబ్‌గా తయారు చేయాలన్నది తమ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా అంతర్జాతీయ స్థాయి డేటా సెంటర్ అభివృద్ధి చేయబోతున్నామన్నారు. ఉత్తరాంధ్రను ఫార్మా హబ్‌గా తీర్చిదిద్దుతామని, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభయ్యాక విశాఖపట్నంతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలు విప్లవాత్మకమైన అభివృద్ధి సాధిస్తాయన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఎయిర్ కనెక్టివిటీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అయితే కేవలం పోర్టులు, ఎయిర్ పోర్టులు ఉంటే మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందినట్లు కాదని, ఆయా రంగాల్లో సాధించిన అభివృద్ధి ద్వారా వచ్చిన మిగతా..2లో

## సమిష్టి శక్తిలోనే మానవాళి విజయం



## ఐరాస సదస్సులో మోదీ

ఐరాస: మానవాళి విజయం సమష్టి శక్తిలోనే దాగుంది తప్ప యుద్ధక్షేత్రంలో కాదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. యుద్ధం ఎన్నటికీ సమస్యల పరిష్కార వేదిక కాబోదని కుండబద్దలు కొట్టారు. సోమవారం న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి 79వ సర్వసభ్య సమావేశంలో భాగంగా 'ప్రపంచ భవితపై శిఖరాగ్ర సదస్సు'లో ప్రధాని ప్రసంగించారు. ఉక్రెయిన్, గాజా యుద్ధాలు, దేశాల నడుమ ఉద్రిక్తతలు, గ్లోబల్ వార్మింగ్, పర్యావరణ మార్పుల వంటి పెను సమస్యల నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రపంచ శాంతికి, ప్రగతికి ఐరాసతో పాటు పలు అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమని మోదీ అభిప్రాయపడ్డారు. "మెరుగైన ప్రపంచ భవిష్యత్తు కోసం చేపట్టే ఏ చర్యలకైనా మనిషి సంక్షేమమే అంతిమ లక్ష్యం కావాలి. అప్పుడే అవి ఫలిస్తాయి" అని మోదీ సూచించారు. "నమస్కారం. ప్రపంచ మానవాళిలో ఆరో వంతుకు సమానమైన 140 కోట్ల మంది భారతీయుల తరఫున వారి గళాన్ని విన్పిస్తున్నా" మిగతా..2లో

# ఎప్పుడూ మన్ కీ బాత్ ముచ్చట్లే

- 'కామ్ కీ బాత్' ఏనాడూ చెప్పలేదు
- కశ్మీర్‌ను ఢిల్లీ సర్కార్ కాదు, స్థానికులే పాలించాలి
- కుల గణన అనడానికే మోదీ జంకుతున్నారు
- వాళ్లు చేయకుంటే మేమే చేస్తాం
- బాధ్యతలను విస్మరించారంటూ ప్రధాని మోదీపై రాహుల్ విమర్శలు



సురాన్‌కోట్(జమ్మూకశ్మీర్)/శ్రీనగర్: జమ్మూకశ్మీర్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. దేశాన్ని పట్టిపీడిస్తున్న నిరుద్యోగ సమస్య, ధరల కట్టడిని మోదీ నిర్లక్ష్యం చేశారని ఎండగట్టారు. సోమవారం పూంఛ్ జిల్లాలోని సురాన్‌కోట్ శాసనసభ నియోజకవర్గంలో, శ్రీనగర్‌లో ఎన్నికల ప్రచార ర్యాలీల్లో రాహుల్ ప్రసంగించారు. "నెలకోసారి 'మన్ కీ బాత్'ముచ్చట్లతో మోదీ మోతెక్కిస్తారు. కానీ ఏనాడూ మిగతా..2లో

### వాతావరణ శాఖ అలర్ట్..
## ఈ 13 రాష్ట్రాల్లో 27 వరకు భారీ వర్షాలు



అమరావతి: కొన్ని చోట్ల ఉపశమనం కలిగించి, మరికొన్ని చోట్ల ఇబ్బంది కలిగించిన తర్వాత ఇప్పుడు రుతుపవనాలు నిష్క్రమించే సమయం వచ్చింది. గుజరాత్ నుంచి రుతుపవనాలు వెనక్కి తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత వాతావరణ శాఖ కూడా సెప్టెంబర్ 23 నాటికి పశ్చిమ రాజస్థాన్, కచ్ నుండి నైరుతి రుతుపవనాల ఉపసంహరణకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని సూచించింది. అయితే విశేషమేమిటంటే దాదాపు 10 రోజుల ఆలస్యంతో మిగతా..2లో

### పిల్లల పోర్నోగ్రఫీ వీక్షణ
# ముమ్మాటికీ నేరమే

సుప్రీంకోర్టు కీలక తీర్పు

వీడియోలు డౌన్‌లోడ్, స్టోర్ చేసుకోవడం పోక్సో చట్టం కింద నేరపూరిత చర్యలే

దేశ అత్యున్నత ధర్మాసనం కీలక తీర్పు

పిల్లల అశ్లీల చిత్రాలు చూడటం నేరం కాదంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు కొట్టివేత

హైకోర్టు తీర్పు ఘోర తప్పిదమని వ్యాఖ్య




హైదరాబాద్, : పిల్లల అశ్లీలత, వారిపై లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియోలను చూడటం ముమ్మాటికీ నేరమేనని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటంతో పాటు ఆ వీడియోలను డౌన్‌లోడ్ చేయడం, స్టోర్ చేసుకోవడం కూడా పోక్సో చట్టం ప్రకారం నేరం కిందకే వస్తుందని పేర్కొంది.

గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
గురువారం - 26 - సెప్టెంబర్ - 2024

# ఇజ్రాయెల్ భీకర దాడుల్లో 356 మంది మృతి

బీరుట్, టెల్ అవీవ్: లెబనాన్ సోమవారం బాంబుల మోతతో దద్దరిల్లింది. దేశంలోని దక్షిణ ప్రాంతంలోని 17 పట్టణాలు, పల్లెలపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. హిజ్బుల్లా ఉగ్రవాదులు తలదాచుకున్నచోట, ఆయుధాలను భద్రపరిచినవిగా భావిస్తున్న నిర్మాణాలపైన రాకెట్ల వర్షం కురిపించింది. అంతకుముందు ఆ ప్రాంతాన్ని వీడి వెళ్లాలని స్థానికులకు హెచ్చరిస్తూ వేలాది ఫోన్ కాల్స్ చేసింది. 11 నెలలుగా ఒకవైపు హమాస్‌తో యుద్ధం చేస్తూనే మరోవైపు హిజ్బుల్లాతోనూ తలపడుతున్న ఇజ్రాయెల్ ఈ స్థాయిలో దాడులకు దిగడం ఇదే తొలిసారి. సోమవారం చేపట్టిన దాడుల్లో 356మంది ప్రాణాలు కోల్పోగా, వెయ్యి మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో 24 మంది పిల్లలున్నారు. తాజా దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయని.. మరో పూర్తిస్థాయి యుద్ధం తప్పదనే ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో అమెరికా జోక్యం చేసుకుంది. అగ్రరాజ్య రక్షణ శాఖ మంత్రి లాయిడ్ ఆస్టిన్ ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గాలంట్‌కు ఫోన్ చేశారు. ఇజ్రాయెల్ ఆత్మరక్షణకు అండగా ఉంటామన్నారు. తమ బలగాలను రక్షించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతూనే, ఉద్రిక్తతలు మరింత పెరగకుండా ప్రయత్నాలు చేస్తామన్నారు. ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకున్న ప్రాంతాల నుంచి భారీఎత్తున ప్రజలు తరలిపోతున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. కాగా, ఇజ్రాయెల్ దాడులను అడ్డుకోవాలని లెబనాన్ ప్రభుత్వం ఐక్యరాజ్య సమితి, పెద్ద దేశాలను కోరింది. హిజ్బుల్లా, ఇజ్రాయెల్ ఎవరూ తగ్గడం లేదని వ్యాఖ్యానించిన ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెరెస్.. లెబనాన్ మరో గాజాలా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

# ఉక్రెయిన్ ప్రెసిడెంట్ జెలెన్స్కీతో సమావేశమైన ప్రధాని మోదీ

ఉక్రెయిన్ : ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్స్కీతో ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం న్యూయార్క్‌లో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. దాదాపు నెల రోజుల వ్యవధిలో ఇరువురు నేతల మధ్య ఇది రెండో సమావేశం.న్యూయార్క్‌లో ప్రెసిడెంట్ జెలెన్స్కీని కలిశానని ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు గత నెలలో ఉక్రెయిన్‌లో మా పర్యటన ఫలితాలను అమలు చేయడానికి మేము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లో వివాదాన్ని త్వరగా పరిష్కరించడం, శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించడం కోసం భారతదేశం మద్దతును పునరుద్ఘాటించారు. ప్రధాని మోదీ, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మధ్య జరిగిన ద్వైపాక్షిక భేటీపై విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ.. మూడు నెలల వ్యవధిలో ఇరువురు నేతల మధ్య జరిగిన మూడో భేటీ ఇది. ద్వైపాక్షిక అంశాలతో పాటు రష్యా-ఉక్రెయిన్ వివాదానికి సంబంధించిన అంశాలపై వారు చర్చించారు. ఈ విషయంలో భారత్ ప్రయత్నాలను అధ్యక్షుడు జెలెన్స్కీ ఎంతో ప్రశంసించారని తెలిపారు. ప్రధాని మోదీ పర్యటన ఎంతో అభినందనీయమని, ఈ వివాదం నుంచి బయటపడేందుకు భారత ప్రధాని మోదీ చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు జెలెన్స్కీ. ద్వైపాక్షిక సంబంధాలు అనేక అంశాలపై సానుకూల పరిణామాలకు సాక్ష్యంగా ఉన్నాయని ఇరుపక్షాలు ప్రశంసించారు. ఇరువర్గాలు పరస్పరం సన్నిహిత సంబంధాలు కొనసాగించేందుకు అంగీకరించాయి. కాగా ప్రధాని మోదీ ఆగస్టు 23న ఉక్రెయిన్‌ను సందర్శించారు. ఉక్రెయిన్ వివాదంలో శాంతిని త్వరగా తిరిగి తీసుకురావడానికి సాధ్యమైన అన్ని విధాలుగా సహకరించాలని భారత్ సూచనగా పునరుద్ఘాటించారు. 1992లో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడిన తర్వాత భారత ప్రధాని ఉక్రెయిన్‌లో తొలిసారిగా పర్యటించిన సందర్భంగా అధ్యక్షుడు జెలెన్స్కీ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ ఉక్రెయిన్‌ను సందర్శించారు.

# దేశంలో తొలి క్లేడ్ 1బీ మంకీపాక్స్ కేసు

ఢిల్లీ: ప్రాణాంతక మంకీపాక్స్‌కు సంబంధించి భారత్‌లో మరో కేసు నమోదైంది. గత నెలలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) 'ఆరోగ్య అత్యయిక స్థితి'గా ప్రకటించిన క్లేడ్ 1బీ రకం మంకీపాక్స్ తొలి కేసు భారత్‌లో నమోదైనట్లు సోమవారం అధికారులు ప్రకటించారు. కేరళలోని మలప్పురం జిల్లాలో ఓ వ్యక్తికి ఈ వ్యాధి నిర్ధారణ అయినట్లు తెలిపారు. యూఏఈ నుంచి ఇటీవల దేశానికి తిరిగి వచ్చిన 38 ఏళ్ల వ్యక్తికి గతవారం క్లేడ్ 1బీ రకం మంకీపాక్స్ సోకినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని వివరించారు. విదేశాల నుంచి తిరిగి వచ్చే వారిలో వ్యాధి లక్షణాలు కనపడితే ఆరోగ్యశాఖకు తెలియజేయాలని, వీలైనంత త్వరగా చికిత్స పొందాలని కేరళ ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ ప్రజలను కోరారు. కాగా అంతకుముందు హరియాణాలోని హిసార్‌లో ఓ 26 ఏళ్ల వ్యక్తికి దక్షిణాఫ్రికా క్లేడ్ 2 రకం మంకీపాక్స్ సోకిన విషయం తెలిసిందే.

### వాతావరణ శాఖ అలర్ట్..

# ఈ 13 రాష్ట్రాల్లో 27 వరకు భారీ వర్షాలు

మొదటి పేజి తరువాయి

రుతుపవనాలు వెళ్లిపోనున్నాయని చెబుతోంది. దేశంలోని అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, సబ్-హిమాలయన్ పశ్చిమ బెంగాల్, సిక్కిం, గంగానది పశ్చిమంలో నైరుతి రుతుపవనాలు ఇప్పుడు బలహీనపడ్డాయని వాతావరణ కేంద్రం శనివారం తెలిపింది. బెంగాల్, జార్ఖండ్, బీహార్, తూర్పు ఉత్తరప్రదేశ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానా, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్, పశ్చిమ మధ్యప్రదేశ్, తూర్పు మధ్యప్రదేశ్, గుజరాత్ ప్రాంతం, సౌరాష్ట్ర, కచ్, కొంకణ్, గోవా, ఛత్తీస్‌గఢ్, రాయలసీమ, తమిళనాడు, దక్షిణ అంతర్గత కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో రుతుపవనాలు బలహీనపడినట్లు ఐఎండీ తెలిపింది. ఈ వారం పశ్చిమ రాజస్థాన్ మినహా వాయువ్య భారతదేశంలో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. కొంకణ్, గోవాలో సెప్టెంబర్ 26 వరకు, మధ్య మహారాష్ట్రలో సెప్టెంబర్ 27 వరకు, మరత్వాడాలో సెప్టెంబర్ 25 వరకు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గుజరాత్ ప్రాంతంలో సెప్టెంబర్ 27 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రానున్న 3 రోజుల్లో ఒడిశా, అండమాన్ నికోబార్ దీవులు, పశ్చిమ బెంగాల్, సిక్కిం, బీహార్, జార్ఖండ్‌లలో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. ఈశాన్య భారతదేశంలో కూడా రాబోయే 2 రోజులలో మోస్తరు వర్షాలు పడవచ్చు. ఈ వారం విదర్భ, ఛత్తీస్‌గఢ్‌లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సోమవారం తెలిపింది. అదే సమయంలో, వచ్చే 7 రోజుల్లో మధ్యప్రదేశ్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. విదర్భ, ఛత్తీస్‌గఢ్‌లలో సెప్టెంబర్ 26 వరకు, మధ్యప్రదేశ్‌లో సెప్టెంబర్ 27 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ వారం కోస్తా కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. తెలంగాణ, కోస్తాంధ్ర, యానాంలో సెప్టెంబర్ 25 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

# ఎప్పుడూ మన్ కీ బాత్ ముచ్చట్లే

మొదటి పేజి తరువాయి

కానీ ఏనాడూ తాను పూర్తిచేయాల్సిన కీలక బాధ్యతలను ప్రస్తావించరు. బాధ్యతలను విస్మరించారు. ఉద్యోగాల కల్పన, ధరల కట్టడి వంటి చేయాల్సిన పనులపై 'కామ్ కీ బాత్'ఏనాడూ చెప్పరు. గతంలో 56 అంగుళాల ఛాతి అంటూ గొప్పలు చెప్పుకుని తిరిగిన ఆనాటి మోదీ ఇప్పుడు లేరు. ఎందుకంటే ఆయన మూడ్‌ను లోక్‌సభ ఎన్నికల తర్వాత విపక్షాల 'ఇండియా'కూటమి మార్చేసింది. ప్రధాని మోదీ సైకాలజీని మా కూటమి దెబ్బకొట్టింది"అని రాహుల్ అన్నారు. జమ్మూకశ్మీర్‌ను ఢిల్లీ ప్రభుత్వం కాకుండా స్థానికులే పాలించాలని రాహుల్ అన్నారు. జమ్మూకశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేసి మోదీ సర్కార్ నేరుగా పరిపాలిస్తున్న నేపథ్యంలో రాహుల్ ఈ వ్యాఖ్యలుచేశారు. "కేంద్రపాలిత ప్రాంతా(యూటీ)లను రాష్ట్రాలుగా మార్చారుగాగానీ రాష్ట్రాన్ని యూటీగా మార్చడం భారత చరిత్రలో ఎన్నడూ జరగలేదు. పూర్తిస్థాయి రాష్ట్రమైన జమ్మూకశ్మీర్‌ను యూటీగా మార్చి ఇక్కడి పౌరుల హక్కులను కాలరాశారు"అని అన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా సైతం పాల్గొన్నారు. "జమ్మూకశ్మీర్‌కు మళ్లీ రాష్ట్ర హోదా కోసం కేంద్రప్రభుత్వంతో పోరాడతాం. అయినా వాళ్లు ఇవ్వకపోతే మేం కేంద్రంలో అధికారంలోకి వచ్చాక మేమే హోదా ఇస్తాం. యూటీకాకమునుపు స్థానికులే కశ్మీర్‌ను పాలించేవారు. ఇక్కడి వారి భవిష్యత్తు, ప్రయోజనాలకనుగుణంగా నిర్ణయాలు జరిగేవి. ఇప్పుడు 'బయటి'వ్యక్తులు మీ గొంతుక వినకుండానే సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇక్కడి ప్రభుత్వాన్ని ఢిల్లీ నడిపిస్తోంది. మేం మీ ప్రభుత్వాన్ని జమ్మూకశ్మీరే నడపాలని కోరుకుంటున్నాం. మీ సమస్యలను పార్లమెంట్ వేదికగా ఎలుగెత్తి చాటేందుకు మీ గొంతుకనవుతా"అని స్థానికులనుద్దేశించి రాహుల్ అన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో రెండో దఫాలో 26 స్థానాలకుగాను సెప్టెంబర్ 25న జరగబోయే పోలింగ్‌కు ప్రచారం సోమవారంతో ముగిసింది. కుల గణన అనడానికి కూడా ప్రధాని మోదీ జంకుతున్నారని రాహుల్ వ్యాఖ్యానించారు. మోదీ, బీజేపీని విమర్శిస్తూ రాహుల్ సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో హిందీలో పలు పోస్టులుచేశారు. "బీజేపీ పూర్తిగా బహుజనుల వ్యతిరేక పార్టీగా తయారైంది. వాళ్లు ఎన్ని పుకార్లు పుట్టించినా, అబద్ధాలు వ్యాపింపజేసినా మేం మాత్రం రిజర్వేషన్లకు ఎలాంటి ముప్పు రానివ్వం. సమగ్ర కులగణన జరిగేదాకా మేం ఊరుకోం. సమాజంలోని ప్రతి వర్గానికి హక్కులు, వాటా, న్యాయం దక్కేలా చూస్తాం. అవసరమైతే 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తేసి ఎక్కువ రిజర్వేష్లను కల్పిస్తాం. మోదీజీ కనీసం కులగణన అనడానికి కూడా భయపడుతున్నారు. బహుజనులకు న్యాయం దక్కడమనేది రాజకీయ అంశంకాదు అది నా జీవిత లక్ష్యం"అని రాహుల్ అన్నారు.

# సమిష్టి శక్తిలోనే మానవాళి విజయం

మొదటి పేజి తరువాయి

అంటూ సాగిన ఐదు నిమిషాల ప్రసంగాన్ని పలు దేశాధినేతలు హర్షధ్వానాలతో స్వాగతించారు. ఉగ్రవాదం ప్రపంచ శాంతికి, భద్రతకు పెను ముప్పుగా పరిణమించిందని మోదీ అన్నారు. మరోవైపు సైబర్, స్పేస్, మారిటైమ్ క్రైమ్ పెను సవాళ్లు విసురుతున్నాయని అభిప్రాయపడ్డారు. "వీటిని సమూలంగా రూపుమాపాలంటే కేవలం మాటలు చాలవు. నిర్దిష్ట కార్యాచరణతో ప్రపంచ దేశాలన్నీ కలిసి రావాలి. అలాగే సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా, సురక్షితంగా వినియోగించుకునేలా అంతర్జాతీయ స్థాయిలో నియంత్రణ వ్యవస్థ రావాలి" అని పిలుపునిచ్చారు. "మానవాళి సంక్షేమానికి ఆహార, ఆరోగ్య భద్రతకు దేశాలు ప్రాధాన్యమివ్వాలి. సంక్షేమ, సుస్థిరాభివృద్ధి పథకాల ద్వారా 25 కోట్ల మంది భారతీయులను పేదరికం నుంచి విముక్తం చేశాం. వాటిని మిగతా దేశాలతో పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నాం" అన్నారు. ప్రారంకోపన్యాసం చేసిన ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలపై మోదీ అభిప్రాయాలతో ఏకీభవించారు. వాటిని బాధ్యతాయుతంగా, నిష్పాక్షికంగా, ప్రభావశీలంగా తీర్చిదిద్దాల్సిన అవసరముందన్నారు. ఐరాస భద్రతా మండలిని కాలం చెల్లిన వ్యవస్థగా అభివర్ణించారు! సరైన సంస్కరణలతో పనితీరును సరి చేసుకోకుంటే దాని విశ్వసనీయత అడుగంటడం ఖాయమని హెచ్చరించారు. ఘర్షణలకు ముగింపు కనుచూపు మేరలో కన్పించడం లేదంటూ ఆవేదన వెలిబుచ్చారు. "పట్టాలు తప్పుతున్న ప్రపంచాన్ని దారిన పెట్టేందుకు కఠిన నిర్ణయాలను, చర్యలను సూచించడమే లక్ష్యంగా సదస్సు జరిగింది" అన్నారు. మెరుగైన ప్రపంచ భవిష్యత్తు కోసం చేపట్టాల్సిన చర్యలతో కూడిన ఒప్పందాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. సమగ్రాభివృద్ధి, అంతర్జాతీయ శాంతిభద్రతలు, శాస్త్ర సాంకేతికత, యువత, భావి తరాలు, అంతర్జాతీయంగా పాలన తీరుతెన్నుల్లో మెరుగైన మార్పులపై ఒప్పందం దృష్టి సారించింది.

# దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా ఏపీ అభివృద్ధికి రూట్ మ్యాప్

మొదటి పేజి తరువాయి

ఆయా రంగాల్లో సాధించిన అభివృద్ధి ద్వారా వచ్చిన సంపద సమాజంలో అన్నివర్గాలకు పంపిణీ చేయడమే అసలైన అభివృద్ధి అన్నారు. దేశంలో రెండో అతిపెద్ద ఎయిర్ పోర్టుగా నేడు హైదరాబాద్ ఎయిర్ పోర్టు అభివృద్ధి చెందిందని, దీనిద్వారా సృష్టించిన సంపదతో తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. జీఎంఆర్ ఆధ్వర్యంలో భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణం ద్వారా విశాఖపట్నంలో దేశంలోనే మెరుగైన మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మహా విశాఖ

విశాఖపట్నంను ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తయారు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆర్థిక రాజధానిగా విశాఖపట్నాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో విశాఖలో డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ రాబోతుందన్నారు. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పనులను వేగవంతం చేస్తామన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నది గతం మాట... ఇప్పుడు చంద్రబాబు నేతృత్వంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఇండస్ట్రీ ఫ్రెండ్లీ విధానాలతో త్వరలో కొత్త పారిశ్రామిక పాలసీ, ఐటీ, ఎలక్ట్రానిక్స్ పాలసీలు ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్రంలో యువ ఐఏఎస్ అధికారి సారథ్యంలో ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు (ఈడీబీ)ను పునరుద్ధరించినట్లు వెల్లడించారు. దీని ద్వారా సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ ద్వారా పరిశ్రమలకు అవసరమైన అనుమతులు ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో ఈడీబీ క్రియాశీలకంగా పని చేయబోతుందని, ప్రస్తుతం దేశంలో తొమ్మిదో అతిపెద్ద ఎకనమిక్ సిటీగా ఉన్న విశాఖను రాబోయే అయిదేళ్లలో ఐదో అతిపెద్ద ఆర్థిక నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు జీఎంఆర్ చేస్తున్న కృషిని లోకేశ్ అభినందించారు. రాష్ట్రంలో రాబోయే అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యసాధనలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలన్నారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు.



రూ.17 వేల కోట్లతో పోర్టుల అభివృద్ధి: మంత్రి జనార్దన్ రెడ్డి

రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వాన వేగవంతంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా రూ.17 వేల కోట్ల వ్యయంతో పీపీపీ విధానంలో రామాయపట్నం, మచిలీపట్నం, భావనపాడు, కాకినాడ గేట్ వే పోర్టులు శరవేగంగా నిర్మితమవుతున్నాయన్నారు. రాష్ట్రంలో నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ పైప్‌లైన్‌లో ఉందన్నారు. మౌలిక సదుపాయాల వృద్ధిలో భాగంగా ఎయిర్ కనెక్టివిటీ పెంచుతున్నామన్నారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నిర్మాణం శరవేగంగా సాగుతోందని తెలిపారు. గ్లోబల్ మార్కెట్‌కు దీటుగా విశాఖపట్నంలో వరల్డ్ క్లాస్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేస్తామన్నారు.

పీపీపీ మోడ్‌లో క్రిటికల్ ఇన్‌ఫ్రా, హౌసింగ్ ప్రాజెక్టులు చేపడతామన్నారు. చంద్రబాబు మార్గనిర్దేశకత్వంలో ఇన్‌ఫ్రా అభివృద్ధిలో భాగంగా విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, హైదరాబాద్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయన్నారు. కొత్తగా గ్రీన్ ఫీల్డ్ పోర్టులు రాబోతున్నాయన్నారు.

18 నెలల్లో భోగాపురం ఎయిర్ పోర్టు పూర్తి: ఎంపీ భరత్

రాబోయే 18 నెలల్లో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విశాఖ ఎంపీ ముతుకుమిల్లి శ్రీభరత్ పేర్కొన్నారు. ఆర్థికాభివృద్ధిలో విశాఖపట్నం దేశంలో 10వ నగరంగా ఉండగా, ఎయిర్ కనెక్టివిటీ విషయంలో మాత్రం 27వ స్థానంలో ఉందన్నారు. ఈ గ్యాప్‌ను సరిదిద్దాల్సి ఉందని చెప్పారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక విశాఖపట్నం నుంచి ఇంటర్నేషనల్ ఎయిర్ కార్గో ప్రారంభమైందన్నారు. వ్యక్తిగత విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకునేలా త్వరలో రాష్ట్రంలో పీఎం సూర్య పథకం ప్రారంభం కాబోతుందన్నారు. దీని ద్వారా విప్లవాత్మక మార్పులు రావడంతో పాటు చౌకగా విద్యుత్ లభిస్తుందన్నారు. విశాఖ నగరంలో ఇప్పటికే ప్రారంభమైన ఇన్‌ఫ్రా ప్రాజెక్టులపై మంత్రి లోకేశ్ దృష్టిసారించి, వేగంగా పూర్తిచేసేందుకు సహకరించాలని కోరారు.

షీలానగర్-సబ్బవరం రోడ్డు విస్తరణ పనులు పురోగతిలో ఉన్నాయని, అనకాపల్లి-భీమిలి రోడ్డు విశాఖపట్నం నగరం గుండా వెళ్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి 12 ఫ్లైఓవర్లను ప్రతిపాదించినట్లు చెప్పారు. ఎలివేటెడ్ హైవే రోడ్డు నిర్మించే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక మార్గాలను అన్వేషిస్తున్నట్లు చెప్పారు. అధునాతన టెక్నాలజీతో హౌసింగ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మంత్రివర్గంలో యువ నాయకత్వంతో విశాఖ నగరం వేగవంతంగా అభివృద్ధి సాధించబోతోందని, ఇందుకు పారిశ్రామికవేత్తలు తమ వంతు సహాయ, సహకారాలు అందించాలన్నారు.

# మూసీ శుద్ధి వెనుక ప్రభుత్వ అస్సలు ఉద్దేశం వేరే ఉంది..

మొదటి పేజి తరువాయి

మూసీ శుద్ధి వెనుక ప్రభుత్వ అస్సలు ఉద్దేశం వేరే ఉంది..

ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీరు మూసీలోకి వెళ్తుంది. 94 శాతం స్వచ్ఛమైన నీరు వెళ్తున్నప్పుడు మూసీ శుద్ధి ఎందుకు..? కొత్తగా మీరు శుద్ధి చేసేదేమీ లేదు. మూసీ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి, మంత్రుల మాటలకు పొంతన లేదు. సీఎం రూ. లక్షా 50 వేల కోట్లు అని అంటడు. మంత్రులేమో రూ. 50 వేల కోట్లు, ఇంకొందరేమో రూ. 70 వేల కోట్లు అని మాట్లాడుతున్నారు. ఈ మాటలను చూస్తుంటే అనుమానం వస్తుంది. మూసీ శుద్ధి వెనుక ప్రభుత్వ అస్సలు ఉద్దేశం వేరే ఉంది అనే అనుమానం ప్రజల్లో కలుగుతుందని కేటీఆర్ తెలిపారు.

ఇప్పటిదాకా మీరు చెప్పినవి అబద్దాలు అని తేలిపోయింది..

హైదరాబాద్‌లో ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు కట్టలేదు అని గతంలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క మాట్లాడారు. నాడు తలసాని శ్రీనివాస్ యాదవ్ దగ్గరుండి భట్టికి డబుల్ బెడ్రూం ఇండ్లు చూపించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో 12 వేల ఆక్రమణలు ఉన్నాయని సీఎం చెప్పారు. వాటిని తొలగించి బాధితులకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని చెప్పారు. మేం డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టకపోతే మీరు ఎక్కడ్నుంచి ఇస్తున్నారు..? ఇప్పటిదాకా మీరు చెప్పినవి అబద్దాలు అని తేలిపోయింది. కేసీఆర్ చేసిన మంచి పనిని ఒప్పుకోక తప్పట్లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.



పబ్లిసిటీ స్టంట్లతో ఎక్కువ రోజులు మాయ చేయలేరు..

సబిత ఇంద్రారెడ్డి నేతృత్వంలో 14 వేల ఎకరాలు ఫార్మా సిటీ కోసం సేకరిస్తే దాన్ని రద్దు చేసి ఫ్యూచర్ సిటీ అని, ఇంకోటి అని రకరకాల డ్రామాలు ఆడుతున్నారు. మూసీకి సంబంధించి మూసీ సుందరీకరణ పేరిట కొత్త నాటకాలు ఆడుతున్నారు. మీరు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయండి. రైతుభరోసా అందించండి.. పబ్లిసిటీ స్టంట్లతో ఎక్కువ రోజులు మాయ చేయలేరు. హైదరాబాద్ ప్రజలకు మేం చేసిన పని బాగా తెలుసు. లింకు రోడ్లు, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, స్మశాన వాటికలు, లైబ్రరీలు కట్టాం. ఇవన్నీ ప్రజల దృష్టిలో ఉన్నాయని కేటీఆర్ తెలిపారు.

పాకిస్తాన్ కంపెనీలకు మూసీ సుందీకరణ

మూసీ సుందీకరణ పేరుతో కుంభకోణం జరుగుతంది. దాన్ని కూడా బయటకు తీస్తాం. పాకిస్తాన్‌కు చెందిన కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇవన్నీ ప్రజలను గమనిస్తున్నారు. భవిష్యత్‌లో అన్ని విషయాలను ప్రజల దృష్టికి తీసుకువస్తాం. పేదలకు ఒక న్యాయం.. పేదోళ్లకు ఒక న్యాయం ఉంది. పేదోళ్లను బుల్డోజర్ల కింద నలిపేస్తున్నారు. బాధితులకు డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయించండి.. ఆలస్యం చేయకండి. పుస్తకాల కోసం వేద శ్రీ మాట్లాడిన మాటలు వింటే గుండె బరువెక్కిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు.

# 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసినా నిరుద్యోగ సమస్య పోదు

హైదరాబాద్: ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసినా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య సమసిపోదని, కాబట్టి నిరుద్యోగ యువత డిమాండ్ - సప్లయ్ సూత్రాన్ని గుర్తుంచుకోవాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మాసాబ్‌ట్యాంక్‌లో బీఎఫ్ఎస్ఐను (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సురెన్స్) స్కిల్ ప్రోగ్రాం మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... లక్షల ఉద్యోగాలు భర్తీ చేసినా నిరుద్యోగ సమస్య తీరిపోదన్నారు. దీని తీవ్రతను తమ ప్రభుత్వం గుర్తించిందన్నారు. ప్రతి సంవత్సరం 3 లక్షల మంది పట్టాలు తీసుకొని బయటకు వస్తున్నారన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడినట్లు తెలిపారు. ఎలాంటి కోర్సులు చదివిన వారు కావాలని అడుగుతున్నట్లు చెప్పారు. అయినప్పటికీ నిరుద్యోగ యువత డిమాండ్ - సప్లయ్ సూత్రాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. డిగ్రీ చదివే వారు భవిష్యత్తు దిశగా ఆలోచన చేయాలన్నారు. కొందరు విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవడం లేదన్నారు. బ్యాంకులు, బీమా రంగాల్లో చాలా ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. నాయకుడిగా రాణించాలన్నా నైపుణ్యం ముఖ్యమని తెలిపారు. ఉద్యోగం, ఉపాధి లేకుంటే యువత చెడు వ్యసనాల వైపు వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బీటెక్ చదివిన వారు కూడా డ్రగ్స్ విషవలయంలో చిక్కుకుంటున్నారని ఆవేదన చెందారు. మన విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు జాబ్ స్కిల్స్ నేర్చుకోవడం లేదని, కొన్ని కాలేజీల్లో అధ్యాపకులు, వసతులు ఉండటం లేదన్నారు. కాలేజీలను ఇలాగే రన్ చేస్తే వాటి గుర్తింపు రద్దు చేయడానికి కూడా వెనుకాడేది లేదని హెచ్చరించారు. త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన పదేళ్ల తర్వాత కూడా 60 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని, తాము అధికారంలోకి వచ్చిన మూడు నెలల కాలంలో 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని వెల్లడించారు. డీఎస్సీ, గ్రూప్స్ విభాగాల్లో మరో 35 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. చదువుతో పాటు నాలెడ్జ్, కమ్యూనికేషన్ ఉండాలన్నారు.

# పిల్లల పోర్నోగ్రఫీ వీక్షణ ముమ్మాటికీ నేరమే

మొదటి పేజి తరువాయి

ఇలాంటి పనులకు తెగబడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని వెల్లడించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలాతో కూడిన ధర్మాసనం సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం నేరం కాదంటూ మద్రాసు హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును కొట్టేసిన న్యాయస్థానం.. ఇలాంటి తీర్పునిచ్చి హైకోర్టు ఘోరమైన తప్పిదం చేసిందని వ్యాఖ్యానించింది.

ధర్మాసనం ఏమన్నదంటే?

పోక్సో చట్టంలో 'చైల్డ్ పోర్నోగ్రఫీ' అనే పదాన్ని 'చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేటివ్ అండ్ అబ్యూసివ్ మెటీరియల్' అనే పదంతో మార్చాలి. ఈ మేరకు పోక్సో చట్టానికి సవరణలు చేయాలి. పై సవరణలు అమల్లోకి వచ్చేవరకు దీనిపై ఆర్డినెన్స్ జారీ చేయాలి. ఇకపై కోర్టులు 'చైల్డ్ పోర్నోగ్రఫీ' పదాన్ని ఉపయోగించవద్దు. చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించిన వీడియోలు స్టోర్ చేసిన వారికి తొలిసారిగా రూ. 5వేల వరకు జరిమానా విధించాలి. ఇలాంటి చర్యలకు మళ్లీ పాల్పడితే రూ.10 వేల వరకు జరిమానా వేయాలి. పిల్లల అశ్లీల వీడియోలను దురుద్దేశంతో ప్రసారం చేస్తే జరిమానాతో పాటు మూడేండ్ల వరకు జైలు శిక్ష విధించాలి. డబ్బుల కోసం చైల్డ్ పోర్నోగ్రఫీని ప్రోత్సహించడం, ఆ వీడియోలను ప్రసారం చేస్తే మూడు నుంచి ఐదేండ్ల పాటు జైలు శిక్ష విధించాలి. గరిష్ఠంగా ఏడేండ్ల పాటు జైలు శిక్ష విధించాలి.

### ఏమిటీ కేసు?

చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించిన వీడియోలను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న 28 ఏండ్ల ఓ యువకుడిపై క్రిమినల్ చర్యలను నిలిపివేస్తూ మద్రాసు హైకోర్టు గతంలో ఆదేశాలిచ్చింది. పోక్సో, ఐటీ చట్టాల ప్రకారం.. చైల్డ్ పోర్నోగ్రఫీని చూడటం తప్పేమీ కాదంటూ ఆ సందర్భంగా వ్యాఖ్యానించింది. సదరు యువకుడు వీడియోలు చూడటం తప్ప ఏమీ చేయలేదని, వాటిని ఇతరులకూ పంపలేదని పేర్కొంది.

పోర్నోగ్రఫీకి అలవాటుపడిన యువతను శిక్షించడం కన్నా వారిని సరైన మార్గం వైపు నడిపించడంపై దృష్టి పెట్టాలని అభిప్రాయపడింది. ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. హైకోర్టు తీర్పును తోసిపుచ్చిన సుప్రీంకోర్టు సదరు యువకుడిపై క్రిమినల్ చర్యలను పునరుద్ధరించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలను డౌన్‌లోడ్ చేసుకొన్నాడంటే, ఆ దురుద్దేశం యువకుడికి ఉందన్నది స్పష్టమవుతున్నదని కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.

లైంగిక విద్యపై అపార్థాలు ఉన్నాయి: సుప్రీంకోర్టు

ఈ కేసు విచారణ సందర్భంగా లైంగిక విద్యపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'తల్లిదండ్రులు, అధ్యాపకులు సహా చాలా మంది శృంగారం గురించి చర్చించడం సరికాదని, అనైతికమని, ఇబ్బందికరమనే సంప్రదాయవాద భావాలు కలిగి ఉన్నారు. సెక్స్ ఎడ్యుకేషన్ అనేది పాశ్చాత్య అంశమని, సంప్రదాయ భారతీయ విలువలకు తగనిదనే భావన ఉంది. ఈ భావనతోనే వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు సెక్స్ ఎడ్యుకేషన్‌ను నిషేధించాయి. ఈ రకమైన వ్యతిరేకత తో సమగ్ర, సమర్థవంతమైన సెక్స్ ఎడ్యుకేషన్ అందకపోవడం వల్ల కౌమార దశలో ఉన్న వారికి తప్పుడు సమాచారం వెళ్తున్నది. వారు ఇంటర్నెట్ వైపు వెళ్లి నియంత్రణ లేని సమాచారం పొందుతున్నారు. సెక్స్ ఎడ్యుకేషన్ అంటే కేవలం జీవపరమైన పునరుత్పత్తి మాత్రమే అనే అపార్థం ఉంది. సమర్థవంతమైన సెక్స్ ఎడ్యుకేషన్‌లో అంగీకారం, ఆరోగ్యకరమైన సంబంధాలు, లింగ సమానత్వం వంటి అంశాలు ఉండాలి. శారీరక హింసను తగ్గించడం, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో ఇవి కీలకం' అని జస్టిస్ పార్దీవాలా పేర్కొన్నారు.

# పిల్లల కోసం నీళ్లు అడిగితే ఇవ్వలేని పరిస్థితి చూశా..

'మూడు రోజులుగా మంచినీళ్లు లేవు.. పిల్లల కోసం మీరు నీళ్లు పంపించగలరా' అంటూ వరద బాధితులు అడిగితే ఓ సీఎంగా మంచినీళ్లు పంపించలేని పరిస్థితిని ఎదుర్కొన్నానంటూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. విజయవాడలో వరద బాధితులకు ఆర్థిక సాయం అందజేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికార యంత్రాంగంతో పాటు తాను కూడా స్వయంగా వెళ్లి వరద బాధితులను కలిశానని చెప్పారు. బాధితులు పెద్ద కోరికలు అడగలేదని, తాగడానికి అది కూడా పిల్లల కోసం మంచినీళ్లు అడిగారని గుర్తుచేసుకున్నారు. వెంటనే అధికారులను పంపించి లక్షలాది వాటర్ బాటిళ్లను సేకరించి పంచామని చెప్పారు. మొత్తంగా కోటికి పైగా వాటర్ బాటిళ్లను పంచామని చెప్పారు. విజయవాడ వాసులు ఎదుర్కొన్న విపత్తును తన జీవితంలో ఇంతవరకూ చూడలేదని చంద్రబాబు చెప్పారు. ఓవైపు ఒకేచోట కుండపోతగా కురుస్తున్న వర్షం (క్లౌడ్ బరస్ట్), మరోవైపు బుడమేరుకు కనీవినీ ఎరుగని వరద వచ్చిందని చెప్పారు. బుడమేరు గండ్లను పూర్చడానికి అధికార యంత్రాంగం పగలూరాత్రి కష్టపడిందన్నారు. రోజుల తరబడి వరదల్లోనే అధికారులు, మంత్రులతో పాటు తాను కూడా తిరిగానని చెప్పారు. బాధితులకు మనోధైర్యం ఇస్తూ ముందుకు సాగామన్నారు. రోజుల తరబడి తాను కలెక్టరేట్ లోనే ఉండి ఎప్పటికప్పుడు వరద సాయంపై పర్యవేక్షణ చేశానన్నారు. డ్రోన్లను, ఫైరింజన్లను, ప్రొక్లెయిన్లను ఉపయోగించి బాధితులను ఆదుకున్నామని చెప్పారు.

దాతలకు పాదాభివందనాలు..

సీఎం రిలీఫ్ ఫండ్ కు రికార్డు స్థాయిలో విరాళాలు వచ్చాయని ఏపీ సీఎం చంద్రబాబు చెప్పారు. తొలిసారిగా సీఎం రిలీఫ్ ఫండ్ కు 400 కోట్ల రూపాయలు విరాళం అందిందన్నారు. వరద బాధితుల పరిస్థితి చూసి స్పందించి విరాళం పంపిన దాతలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. దాతలకు పాదాభివందనం చేస్తున్నానని చెప్పారు. మానవతా దృక్పథంతో స్పందించారని చెబుతూ... వీల్ చెయిర్ పై వచ్చి, అమెరికా నుంచి ఫోన్ చేసి ఇక్కడ ఉంటున్న వారిని స్వయంగా పంపించి చెక్కులు అందజేశారని తెలిపారు. స్కూలు పిల్లలు కూడా ఐదు, పది రూపాయలు, కిడ్డీ బ్యాంకులు పగలకొట్టి డబ్బులు తెచ్చిచ్చారని వివరించారు. వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు చెబుతున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. సంఘటితంగా ముందుకు వస్తే విపత్తులను ఎదుర్కోవచ్చని చాటిచెప్పారని దాతలను కొనియాడారు.

వరద బాధితులకు అందజేసినవి..

14 కోట్ల వాటర్ బాటిళ్లు, 37 లక్షల మిల్క్ బాటిళ్లు, 47 లక్షల బిస్కెట్ ప్యాకెట్లు, 5 లక్షల కోడి గుడ్లు, 3.50 లక్షల క్యాండిల్స్, 2.30 లక్షల మ్యాచ్ బాక్సులు

1.15 కోట్ల ఆహార ప్యాకెట్లు, 5 వేల క్వింటాళ్ల కూరగాయలు. దాదాపుగా 75 వేల ఇళ్లను, 330 కిలోమీటర్ల మేర రోడ్లను ఫైర్ డిపార్ట్ మెంట్ సిబ్బంది క్లీన్ చేశారు. 20 వేల మెట్రిక్ టన్నుల చెత్తను శానిటేషన్ డిపార్ట్ మెంట్ సిబ్బంది తొలగించారు.

## వ్యాధి నిరోధక టీకాల నాణ్యతను పరిశీలించిన

### సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డే బోయిన శ్రీనివాస్



మనం కూడా జిల్లా(గౌతమ్ న్యూస్): మానుకోట జిల్లా మున్సిపాలిటీ కట్టెల మండి అంగన్వాడి సెంటర్ సబ్ సెంటర్ ఇందిరా నగర్ కాలనీ, యు పి హెచ్ సి మహబూబాబాద్ నందునిర్వహించిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పరిశీలించి ఈ సందర్భంలో సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యాక్సిన్



కూల్ ప్రదేశంలో ఉంచి టీకాలను వేయాలని, ఎండ వేడి పడకుండా చూడాలని వాటి యొక్క నాణ్యతను కోల్పోకుండా చూడాలని, అలాగే వ్యాక్సిన్ యొక్క ఎక్స్పైరీని మరియు నాణ్యతను పరిశీలించి తగు జాగ్రత్తలను సూచనలు ఇవ్వడం, పిల్లలకు మరియు గర్భిణీలకు సకాలంలో టీకాలు వేయాలని, అలాగే కంకర బోర్డ్ స్కూల్ నందు వంట గదిని పరిశీలించి కూర కాయలు మరియు బియ్యం అన్ని రకాల వస్తువులను పరిశీలించి వంట వారికి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. పాడైన కూరగాయలను తీసివేయాలని బియ్యంలో పురుగులను లేకుండా చూసి వండాలి, అలాగే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెల్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ రవీందర్, ప్రిన్సిపల్ కొట్టియా నాయక్, ఏ ఎన్ ఎం భవిత లలిత, ఆశ సరిత, అంగన్వాడి టీచర్ మాధవి, ఆయా, నాగముణి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## జనవాణి కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా వినతుల వెల్లువ



పోలవరం ((గౌతమ్ న్యూస్): జనసేన కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో బుధవారం ఉదయం ప్రజల



నుంచి నేరుగా అర్జీలు స్వీకరించిన జనసేన పార్టీ పోలవరం శాసనసభ్యులు శ్రీ చిర్రి బాలరాజు గారు.



వినతుల అందించిన వారి సమస్యను సంబంధిత అధికారులకు ఆదేశించి సమస్య పరిష్కారం కొరకు కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. బాధితులు తెలిపిన సమస్యలు నమోదు చేసి, తక్షణ పరిష్కారం అవసరమైన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, లీగల్ సెల్ సభ్యులు,జనసేన పార్టీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కారటం సాయి గారు,జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ గారు, విజయవాడ ఈస్ట్ కో ఆర్డినేటర్ రావిపాటి సౌజన్య గారు,ప్రత్తిపాడు జనసేన ఇంచార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, కాకినాడ జిల్లా కార్యదర్శి పెంటకోట మోహన్ గారు, జిల్లా సంయుక్త కార్యదర్శి దాసం శేషరావు గారు,స్టేట్ జాయింట్ సెక్రటరీ సుందరరామిరెడ్డి గారు పాల్గొన్నారు... పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలలో పోస్టుల భర్తీ!!

### ఈనెల 27న సర్టిఫికెట్ల వెరిఫికేషన్!!

### జిల్లా డీఈవో గోవిందరాజ్, జిల్లా సెక్టోరియల్ అధికారి సుబలక్ష్మి వెల్లడి



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): వనపర్తి జిల్లాలోని వివిధ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో 2024 సంవత్సరానికి గాను ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు వనపర్తి జిల్లా సమగ్ర శిక్ష జిల్లా సెక్టోరియల్ అధికారి సుబ్బలక్ష్మి తెలిపారు, 2023 సంవత్సరంలో నిర్వహించిన ఆన్లైన్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల వివరాలను జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం లో జాబితా ప్రకటించడం జరిగిందని ఆమె తెలిపారు, రాష్ట్ర సమగ్ర శిక్ష సంచాలకు తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు వనపర్తి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో ఖాళీగా ఉన్న ప్రత్యేక అధికారి పోస్టులు (2) క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సి ఆర్ టి లు) పోస్టులు (8) పోస్ట్ గ్రాడ్యుయేషన్ టీచర్ పోస్టులు పీజీఆర్టీలు పోస్టులు (4) పోస్టులతో పాటు పిఈటి పోస్టులు (1) చొప్పున ఖాళీలు ఉన్నాయని వీటి కోసం గతంలోనే ఎంట్రన్స్ పరీక్ష లో చిరుత సాధించిన అభ్యర్థులను రోస్టర్ కం మెరిట్ ప్రకారంగా 1:3 ప్రకారంగా ఇంటర్వ్యూలకు ఆహ్వానించడం జరిగిందని జాబితాలో పేరు కలిగిన లేదా జిల్లా కార్యాలయం నుంచి చరవాణి ద్వారా సమాచారం అందుకున్న అభ్యర్థులు ఈనెల 27న ఉదయం 11 గంటలకు వనపర్తి జిల్లా కేంద్రంలోని సమగ్ర శిక్ష కార్యాలయానికి చేరుకోవాలని డీఈవో గోవిందరాజ్, జిల్లా సెక్టోరియల్ అధికారి సుభలక్ష్మి విజ్ఞప్తి చేశారు, ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయడం జరుగుతుందని ప్రతి ఒక్కరు తమ తమ సర్టిఫికెట్లను ఆధార్ కార్డును వెంట తీసుకురావాలని ఆమె కోరారు, మెరిట్ కం రోస్టర్ ప్రకారం ఈ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని అభ్యర్థులు గమనించాలని ఆమె సూచించారు,

## పోలీసుల కస్టడీకి జానీ మాస్టర్!



హైదరాబాద్ (గౌతమ్ న్యూస్): జానీ మాస్టర్ను పోలీసుల కస్టడికి ఇవ్వాలంటూ నార్సింగ్ పోలీసులు పిటిషన్ దాఖలు చేసిన పిటిషన్ పై ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. లైంగిక ఆరోపణల కేసులో అరెస్ట్ అయిన ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. జానీకి 4 రోజుల పోలీస్ కస్టడీ విధించింది.రంగారెడ్డి కోర్టు. థర్డ్ డిగ్రీ ప్రయోగించవద్దని.. అవసరమైతే న్యాయవాది సమక్షంలో విచారించాలని సూచించింది. దీంతో చర్ల పల్లి జైల్లో ఉన్న జానీని.. నేటి నుంచి నాలుగు రోజుల పాటు కస్టడీకి తీసుకొని పోలీసులు ప్రశ్నించను న్నారు. లేడీ కొరియోగ్రాఫర్ ఫిర్యాదుతో జానీ మాస్టర్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టు అనుమతి నేపథ్యంలో జానీ మాస్టర్ను కస్టడీలోకి తీసుకునేందుకు పోలీసులు బుధవారం చంచల్‌గూడ జైలుకు వెళ్లారు.

## బయ్యారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మహాజన సభ




బయ్యారం,(గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా బయ్యారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బైలా ప్రకారం ప్రతి ఆరు నెలలకు ఒకసారి జరుపవలసినటువంటి మహాజన సభను ఈ నెల 27 వ తారీఖున (శుక్రవారం) రోజున ఉదయం 11:00 గ"లకు సంఘ అధ్యక్షులు మూల మధుకర్ రెడ్డి అధ్యక్షతన జరుగును. కావున రైతు సోదరులు అందరు సకాలంలో హాజరు అయ్యి గడిచిన ఆరు నెలలు జరిగినటువంటి కార్యకలాపాలను సంఘ సభ్యుల ముందు ఉంచబడును. రాబోయే ఆరు నెలల కాలంలో చేయవల్సినటువంటి కార్యక్రమాలను సభ్యుల సూచనలను సలహాలను తీసుకోవడం జరుగుతుంది. కావున సంఘ శ్రేయస్సును దృష్టిలో వుంచుకొని మీరు అందరు కూడా సకాలంలో విచ్చేసి తగిన సూచనలు సలహాలు ఇవ్వవలసినదిగా ముఖ్య కార్యనిర్వహణ అధికారి కోరుచున్నారు.

# అతిపెద్ద ప్రజాస్వామ్యంలో అతిపెద్ద పార్టీ బిజెపి!!

### కాంగ్రెస్ కుటుంబ పాలనకు చరమగీతం!!

### బిజెపి మాజీ ఎమ్మెల్యే సభ్యత్వ ఇంచార్జ్ ధర్మారావు వెల్లడి!!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో భారతీయ జనతా పార్టీ అతి పెద్ద పార్టీ.అతిపెద్ద పార్టీ సభ్యత్వం కలిగిన పార్టీగా బిజెపి అవతరించిందని గత కొన్ని సంవత్సరాల క్రితం దేశంలో కుటుంబ పాలన నడిచిందని ఒకే పార్టీ ఒకే కుటుంబం ,పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలను తొక్కి పెట్టిందని అందుకే ప్రజలు తగిన గుణపాఠం చెప్పి భారతీయ జనతా పార్టీకి పట్టం కట్టడం జరిగిందని బిజెపి హనుమకొండ మాజీ శాసనసభ్యులు బిజెపి మహబూబ్ నగర్, నల్గొండ ఉమ్మడి జిల్లాల బిజెపి సభ్యత్వ కార్యక్రమం ఇంచార్జ్ ధర్మారావు అన్నారు, బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని లక్ష్మీ కృష్ణ



గార్డెన్ ఫంక్షన్ హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 44 సంవత్సరాల చరిత్ర కలిగిన భారతీయ జనతా పార్టీ ప్రయాణంలో రెండు పార్లమెంటు సీట్లతో ప్రస్థానమైన బిజెపి 2024 సంవత్సరం నాటికి గణనీయమైన పార్లమెంటు స్థానాలను గెలుచుకోవడం జరిగిందని అన్నారు, రెండు పార్లమెంటు స్థానాల నుంచి 282, ఆ తర్వాత 303, ప్రస్తుతం 245 సీట్లతో భారతదేశాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముచ్చటగా మూడోసారి పరిపాలించడం గర్వించదగ్గ విషయమన్నారు, ముఖ్యంగా పేద ప్రజలు భారతీయ జనతా పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని ఎక్కడ చూసినా కార్మికులు కర్షకులు, రైతులు, రైతు కూలీలు, మెజార్టీ సంఖ్యలో భారతీయ జనతా పార్టీలో సభ్యత్వాన్ని స్వీకరిస్తూ పార్టీలో చేరడానికి ముందుకు వస్తున్నారని అన్నారు, భారత దేశంలో గతంలో ఏ ప్రభుత్వం చేయని సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందుతున్నాయని అందుకే పేద ప్రజలు బిజెపి వైపు మొగ్గు చూపుతున్నారని ఆయన అన్నారు, మహిళా సాధికారత, ముద్ర రుణాలు, పిఎం కిసాన్ యోజన, ఆయుష్మాన్ భారత్, ఉజ్వల పథకం, తో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని దేశవ్యాప్తంగా ప్రతి ఒక్క పేద మహిళలకు జీరో అకౌంట్ పేరుతో ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 52 కోట్ల మందికి జీరో అకౌంట్లను అందించిన ఘనత బిజెపి ప్రభుత్వానికి దక్కిందని అన్నారు, అంతేకాక గతంలో ఉన్న 14 కోట్ల గ్యాస్ కనెక్షన్లను 2024 నాటికి 36 కోట్లకు పెంచుతూ ఉజ్వల పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్ ఇవ్వడం జరిగిందని ధర్మారావు సందర్భంగా అన్నారు, అందరికీ సంక్షేమ పథకాలు అందడమే బిజెపి లక్ష్యంగా ప్రజాపాలన దిశగా అడుగులు వేస్తూ దూడమైన సంకల్పంతో బిజెపి ప్రభుత్వం పని చేస్తుందని ఆయుష్మాన్ భారత్ పథకం కింద కార్పొరేట్ ఆసుపత్రి నుంచి మొదలుకుంటే ప్రతి ఆసుపత్రిలో ఐదు లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్న బిజెపి ప్రభుత్వం ప్రస్తుతం ఆ నిధులను పెంచుతూ 10 లక్షల వరకు ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా వేద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు ఈ తెలంగాణ రాష్ట్రంలో గత టీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు దరి చేరకుండా అమలుకాకుండా కుట్ర చేస్తున్నాయని ఆయన ఆరోపించారు, కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో సంబంధం లేకుండా ఎన్నో పథకాలను అమలు చేస్తున్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం కట్టడి చేస్తూ పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుకున్న కుట్ర చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు, దేశంలో ఆయుష్మాన్ భారత్ పథకం కింద పది కోట్ల కుటుంబాలు దాదాపు 60% జనాభా సరాసరి 55 కోట్ల మంది ప్రజలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని ధర్మారావు వెల్లడించారు, అదేవిధంగా ముద్ర రుణాల కింద 16 కోట్ల మంది చిన్న మధ్యతరహా కుటుంబాలకు కార్మికులకు, 50 వేల నుంచి ప్రారంభమైన ముద్ర రుణాలు ప్రస్తుతం 20 లక్షల వరకు అందిస్తున్నామని ఇప్పటివరకు ముద్ర రుణాల కింద దేశవ్యాప్తంగా కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని వెల్లడించారు, కరోనా సమయంలో దేశం ఆర్థిక స్థితిగతి చిన్న భిన్నం అయినప్పటికీ ఆర్థిక సంక్షోభంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశంలోని ప్రతి ఒక్కరికి ప్రతినెల ఒకటో తారీకు రోజు జీతభత్యాలు చెల్లించి దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించిన చరిత్ర ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి దక్కిందని ఆయన సూచించారు, 184 రోజులు ఈ దేశాన్ని అతలాకుతలం చేసిన కరోనా మహిమారి నుంచి ఈ దేశాన్ని దేశ ప్రజలను ప్రాణాల నుంచి కాపాడి కరోనాను కాల తరిమిన చరిత్ర బిజెపికి దక్కిందన్నారు, అందుకే ఎక్కడ చూసినా పేద ప్రజలు బిజెపి వైపు మొగ్గు చూపుతున్నారని, గతంలో ఉన్న సభ్యత్వం పూర్తిస్థాయిలో రెట్టింపు చేస్తున్నామని, గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి పూర్తిస్థాయిలో పుంజుకున్నదని గత పార్లమెంటు ఎన్నికల్లో ఎనిమిది పార్లమెంటు స్థానాలు గెలుపొందడం విశేషం అన్నారు, తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో 25 లక్షల మంది ఓటర్లు బిజెపికి ఓటు వేశారని 14% ఓటింగ్ శాతం బిజెపికి తక్కిన ధర్మారావు వెల్లడించారు, అదేవిధంగా పార్లమెంటు ఎన్నికల్లో 70 లక్షల మంది ఓటర్లు బిజెపికి తమ ఓటును వేయడం విశేషం అన్నారు,అదేవిధంగా దేశంలో 33 కోట్ల 55 లక్షల మంది ఓటర్లు బిజెపి పార్టీకి ఓటు వేశారని ఆయన పేర్కొన్నారు, బిజెపి దేశవ్యాప్తంగా తలపెట్టిన సభ్యత్వ కార్యక్రమం ద్వారా గ్రామస్థాయి నుంచి బూతు స్థాయి వరకు మొత్తం 36వేల బూతుల లో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో 50 లక్షల సభ్యత్వాన్ని చేయించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ధర్మారావు అన్నారు, బిజెపి సభ్యత్వ కార్యక్రమంలో మహబూబ్నగర్ జిల్లా మొదటి స్థానంలో నిలబెట్టడమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని ఇందుకోసం సభ్యత్వాలను ముమ్మరంగా చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు, ఈ విలేకరుల సమావేశంలో, నాగర్ కర్నూల్ పార్లమెంట్ మాజీ ఎంపీ పోతుగంటి రాములు, బిజెపి వనపర్తి జిల్లా సభ్యత్వ ఇంచార్జ్ నరేందర్ రావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరెడ్డి, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మున్నూరు రవీందర్, బిజెపి సభ్యత్వ ఇంచార్జ్ జడ్పిటిసి సభ్యులు లోకనాథ్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు డి, నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు అక్కల రామన్ గౌడ్, పట్టణ అధ్యక్షులు బచ్చు రాము, మీడియా కన్వీనర్ పెద్దిరాజు, రామన్న గారి వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ సుమిత్ర, తదితరులు పాల్గొన్నారు,

# సాగునీటి ప్రాజెక్టు లను నూటికి నూరు శాతం పూర్తి చేస్తాం !!

### నీటిపారుదల శాఖ మంత్రి " ఉత్తమ్" వెల్లడి!!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్రం లోని సాగునీటి ప్రాజెక్టు లను నూటికి నూరు శాతం పూర్తి చేస్తామని రాష్ట్ర నీటి పారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు.బుధవారం రాష్ట్ర నీటి పారుదల శాఖ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,నాగర్



కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి,రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి,ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, ఎమ్మెల్యే లు మధు సుధన్ రెడ్డి,తూడి మేఘా రెడ్డి,నీటి పారుదల శాఖ రాష్ట్ర స్థాయి అధికారులు లతో కలిసి వనపర్తి జిల్లా కొత్త కోట , మండలం,కానాయపల్లి గ్రామంలోని శంకర సముద్రం రిజర్వాయర్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా రాష్ట్ర నీటి పారుదల,రెవెన్యూ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉమ్మడి పాలమూరు జిల్లా లోని పురోగతిలో ఉన్న,పెండింగ్ లో ఉన్న పాలమూరు రంగారెడ్డి,రాజీవ్ గాంధీ భీమా,మహాత్మా గాంధీ,జవహర్ నెట్టంపాడు,కోయల్ సాగర్,గట్టు వంటి నూతన సాగునీటి ప్రాజెక్టు లను నూటికి నూరు శాతం పూర్తి చేస్తామని రాష్ట్ర నీటి పారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు.రాజీవ్ భీమా సాగునీ టి ఎత్తిపోతల పథకం లోని శంకర సముద్రం అర్ అండ్ అర్ సమస్యలను పరిష్కరిస్తామనీ తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి,ఇరిగేషన్ శాఖ



అధికారులు పునరావాస కేంద్రాల ఏర్పాటు,సాగునీటి కాలువల నిర్మాణానికి అయ్యే వ్యేయం,ఎంత ఆయకట్టు కు నీరు అందించగలం మన్నా పూర్తి నివేదికలను సమర్పించాలని మంత్రి ఆదేశించారు.నివేదికలు అందిన వెను వెంటనే నిధులను మంజూరు చేసి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దేవరకద్ర శాసనసభ్యులు మధు సుధన్ రెడ్డి,వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి,ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణ రావు,సాగునీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,ఈఎన్ సి (జనరల్)అనీల్ కుమార్,ఎస్ ఈ శ్రీనివాస్ రెడ్డి,ఈఈ కేశవ్ రావు,మధుసూదన్ రెడ్డి,డీ ఈ ఎల్ల స్వామీ,ఏ.ఈ



అఖిల్,కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు,నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 10 ఎకరాల లోపు సాగు రైతులకు రైతు భరోసా తక్షణమే వర్తింప చేయాలి

### భూ సమస్యల పరిష్కారానికి డిజిటల్ సర్వే చేపట్టాలి

### రైతాంగ సమస్యలను పరిష్కరించాలని అక్టోబర్ 15న మండల కేంద్రాల్లో ఆందోళనలు

### ఏఐకెఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశ నిర్ణయం



నర్సంపేట(గౌతమ్ న్యూస్): రైతుల పెట్టుబడి సహాయం కోసం తక్షణమే 10 ఎకరాల లోపు సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా అమలు చేసి ఎకౌంట్లో డబ్బులు జమ చేయాలని, రైతులు పండించే అన్ని రకాల వరి ధాన్యాలకు క్వింటాకు 500 రూపాయల బోనస్ వర్తింపచేయాలని, రైతుల రెండు లక్షల రుణాలను బేషరతుగా మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకెఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. అఖిలభారత రైతు సమైక్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు వసుకుల మట్టయ్య అధ్యక్షతన నర్సంపేటలోని ఓంకార్ భవన్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో ప్రస్తుతం రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వ విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి 30 లక్షల ఎకరాల సాగు అవుతున్న అధిక వర్షాలు ప్రభుత్వ విధానాలతో రైతుల పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని ఒకవైపు ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోయి మరోవైపు అధిక వర్షాలతో పంటలు కోల్పోయి ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారని ప్రధాన పంటలైన పత్తి మొక్కజొన్న తీవ్రంగా దెబ్బతిన్నాయని కేవలం వారి పంట మాత్రమే కొంత ఆశాజనకంగా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు ప్రభుత్వం రైతులకు అనేక ఆశాజనకమైన హామీలు ఇచ్చి ఆచరణలో మొండి చేయి చూయిస్తున్నదని వర్షాలతో పంటలు కోల్పోయిన రైతులను ఆదుకునేందుకు ఎకరాకు పదివేలు ఇస్తామని చెప్పి నేటికీ క్షేత్రస్థాయిలో పంటల సర్వే చేపట్టకుండా ఎలా ఆదుకుంటారని ప్రశ్నించారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తున్నామని అంటూనే ఆచరణలో కుంటి సాకులతో అమలు చేయడం లేదని 72 లక్షల మంది రైతులలో బ్యాంకర్స్ ఇప్పటివరకు కేవలం 12 లక్షల మందికి మాత్రమే పంట రుణాలు ఇచ్చారని అలాగే రైతులు అనేక దశాబ్దాలుగా భూములు సాగు చేసుకుంటూ వారసత్వంగా వస్తున్న భూములను సైతం రికార్డులోంచి తొలగించి అనేక ఇబ్బందులకు గత ప్రభుత్వం గురిచేసిందని సరిచేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం నేటికీ సరి చేయకపోవడం విడ్డురంగా ఉందన్నారు. అలాగే రైతులు పండించిన వరి ధాన్యానికి ఎకరాకు 500 రూపాయల బోనస్ ఇస్తామని చెప్పి ప్రస్తుతం సన్న రకం వరి ధాన్యానికే ఇస్తామని అనడం సరైంది కాదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతాంగాన్ని ఆదుకోవాలని ఎన్నికల హామీలను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతాంగ పోరాటాలను ఉధృతం చేయాలని నిర్ణయించినట్లు ఈ క్రమంలో అక్టోబర్ 15న రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టనున్నట్లు రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వల్లెపు ఉపేందర్ రెడ్డి రాష్ట్ర నాయకులు గుండెబోయిన చంద్రయ్య మహమ్మద్ ఇస్మాయిల్ వక్కల కిషన్ సింగతి మల్లికార్జున్ నాగేల్లి కొమరయ్య కర్ర రవీందర్ గౌడ్ ప్రభాకర్ రెడ్డి మారయ్య అంజయ్య పెంటయ్య ఓడ్డే నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పేరుతో ఫేక్ మెసేజ్ లు.మోసపూరితమైన మెసేజ్ లను నమ్మొద్దు. రెస్పాండ్ కావద్దు. వెంటనే మెసేజ్ బ్లాక్ చేయండి

### - కలెక్టర్ దివాకర టి. ఎస్.

ఏటూరునాగారం(ములుగు) **(గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పేరుతో సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతా సృష్టించారు. ఈ ఖాతాను ఉపయోగించుకుని పలువురి నుంచి డబ్బు వసూలు చేసేందుకు సైబర్ నేరగాళ్లు యత్నిస్తున్నారు. కలెక్టర్ దివాకర టి. ఎస్. మీటింగ్ లో ఉన్నానని, అర్జెంట్ డబ్బులు కావాలంటూ o998886747021 ఉజ్బెకిస్తాన్ నంబర్ నుంచి ఆ సందేశం పంపిన సబైర్ నేరగాడు డబ్బులు ఫోన్‌పే చేసి, స్క్రీన్‌షాట్ షేర్ చేయాలని కోరాడు. పలువురికి మేసేజ్‌లు పంపించారు. దీన్ని గమనించిన కలెక్టర్ దివాకర టి.ఎస్. తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన అసలు ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా అందరిని అప్రమత్తం చేశారు. తన పేరుతో ఎవరూ డబ్బులు అడిగిన ఇవ్వొద్దని కలెక్టర్ సూచించారు. పై నంబర్ మోసపూరితమైనది, దయచేసి జవాబు ఇవ్వకండి. మరియు వీలైనంత త్వరగా బ్లాక్ చేయమని కలెక్టర్ దివాకర టి.ఎస్. ప్రతి ఒక్కరినీ కోరారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సైబర్ కేటుగాళ్ల ఆటకట్టించేందుకుసిద్ధమయ్యారు.

## సమ్మక్క - సారక్క సెంట్రల్ వర్సిటీలో స్పాట్ అడ్మిషన్స్

## పారిక తుకరాం ఎగ్జామినేషన్ కంట్రోలర్

ఏటూరునాగారం(ములుగు)**(గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: ములుగు జిల్లాలోని సమ్మక్క - సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ (ఎస్ ఎస్ సి టి యూ) బీఏ ఆనర్స్ ప్రోగ్రాం లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లునిర్వహించబడుచున్నవని పారిక తుకరాం ఎగ్జామినేషన్ కంట్రోలర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ స్పెషలైజేషన్, ఏకనామిక్స్ స్పెషలైజేషన్ వర్సిటీ నిర్వహించే కౌన్సెలింగ్ ద్వారాఅడ్మిషన్లుఇవ్వబడునని, ఆసక్తిగలవారు నోటికేషన్ లో తెలిపిన గూగుల్ ఫారమ్ నింపి సబ్మిట్ చేయవలసి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ వర్సిటీకి యూనివర్సిటీ అఫ్ హైదరాబాద్(యూ ఓ హెచ్) మెంటార్ వర్సిటీగా వ్యవహరిస్తోంది. యూఓ హెచ్ వెబ్సైట్లోవివరాలుచూడవచ్చు.

అర్హత:

పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి.ఎస్సి, ఎస్టీ అభ్యర్థులకు పాసైతే చాలు.సీయూ ఈ టీ యూజీ 2024 అర్హత సాధించిన అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ మెరిట్ ఆధారంగా అవకాశం కల్పించ బడును.

ముఖ్య సమాచారం.

అభ్యర్థులు రిపోర్ట్ చేయాల్సిన తేదీ: అక్టోబరు, 3 న ఉదయం 9.00 గంటలకు.

అభ్యర్థులు తీసుకురావాల్సిన పత్రాలు: 10 వ తరగతి, పన్నెండో తరగతి సర్టిఫికెట్లు, టీసీ, అభ్యర్థి ఫోటో, దరఖాస్తు కాపి. వేదిక :: యూత్ ట్రెయినింగ్ సెంటర్, వైటీసీ బిల్డింగ్, జాకరం గ్రామం, ములుగు జిల్లా. వెబ్ సైట్: http://acad.uohyd.ac.in

## యువత స్వామి వివేకానంద జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి **(గౌతమ్ న్యూస్):** కొత్తగూడెం : కొత్తగూడెం క్లబ్ లో జరిగిన జిల్లాస్థాయి యువజనోత్సవాలలో భాగంగా బుధవారం జిల్లా క్రీడా మరియు యువజన శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పైన అపారమైన భారం ఉంటుందని, ఏదైనా యువతతోనే సాధ్యం అవుతుందని, దానికి అనుగుణంగా యువత ముందుకు సాగాలనిఅన్నారు.యువత స్వామి వివేకానంద జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. కొమురం భీం ఇదే అటవీ ప్రాంతంలో తిరిగారన్నారు. అదేవిధంగా రుద్రమదేవి ఆనవాళ్లు చంద్రుగొండ గుట్టల పైన ఇంకా కనబడుతున్నాయని, శక్తివంతమైన వ్యక్తులు శక్తివంతమైన ప్రాంతం నుండి వస్తారని వారిని స్ఫూర్తిగా తీసుకొని యువత ఈ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అని ఇంకా అభివృద్ధి పరచాలని కోరారు. ఆ రోజుల్లో స్వామి వివేకానంద ఇప్పుడు ఉన్నటువంటి ప్రసార మాధ్యమాలు లేనప్పటికీ ఆయన ప్రసంగం ప్రపంచం మొత్తం చేరిందని, ఆయన ద్వారానే స్వాతంత్ర ఉద్యమం మొదలైందని అన్నారు. స్వామి వివేకానంద ప్రసంగాల ద్వారా యువత ఆకర్షితులై పెద్ద ఎత్తున స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. స్వాతంత్ర సమరయోధుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని యువత మంచి ఆరోగ్యం మరియు దేశాభివృద్ధికి తోడ్పడి దేశాన్ని ముందుకు తీసుకువెళ్లాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ విద్యా చందన, జిల్లా క్రీడా మరియు యువజన శాఖాధికారి పరంధామ రెడ్డి, జిల్లా సైన్స్ ఫెయిర్ అధికారి చలపతిరావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు మరియు మైనింగ్ కళాశాల ప్రిన్సిపల్ జగన్మోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ స్థాయి క్రీడల్లో ప్రతిభ చాటిన జెడ్ పి హెచ్ ఎస్ బేతంపూడి విద్యార్థులు



టేకులపల్లి **(గౌతమ్ న్యూస్):** రుద్రంపూర్ లో ఈ నెల 23, 24 తేదీలలో జరిగిన జోనల్ స్థాయి ఆటల పోటీలో జడ్పీహెచ్ఎస్ బేతంపూడి విద్యార్థులు ప్రతిభ ను చాటారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ధారావత్ శ్రీజ అండర్ 14 కేటగిరీ లో జిల్లా స్థాయి కబడ్డీ జట్టు కు ఎంపికయింది. అలాగే 9వ తరగతి విద్యార్థి బోడ సాయి కుమార్ 400మీటర్ ల పరుగు పందెంలో మొదటి బహుమతి, మరియు 600 మీటర్ల పరుగు పందెం లో 2వ బహుమతి ని సాధించి, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అదేవిధంగా మాలోత్ అక్షయ్ షాట్ పుట్ లో 3వ బహుమతి , బానోత్ జ్యోతిక 200మీటర్ల పరుగుపందెంలో 3వ బహుమతి పొందడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధారావత్ తారా సింగ్ గెలుపొందిన విద్యార్థులను మరియు పాఠశాల పి ఈ టి నాగలక్ష్మి ని అభినందిస్తూ జిల్లా స్థాయిలో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు . ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు నాగేశ్వరరావు , సరోజ్ కుమార్, సైదులు, గోపాల కృష్ణ, హైమావతి, ధనపూర్ణ పాల్గొని, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## ప్రోగ్రెసివ్ రికగ్నైస్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్

### సర్వసభ్య సమావేశం జడ్పీ హాల్ వరంగల్

### రెండవ సారి ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం



నర్సంపేట **(గౌతమ్ న్యూస్):** వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఈదునూరి రవీందర్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా శ్రీ మహమ్మద్ గఫార్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఇంద్రసేనారెడ్డి, కార్యదర్శిగా ఎన్నికైన నరసింహా రెడ్డి పి ఆర్ టి యు టి ఎస్ చెన్నారావుపేట మండల శాఖ అధ్యక్షుడు పూజరి సురేందర్ మరియు ప్రధాన కార్యదర్శి బానోతు వెంకన్న శుభాకాంక్షలు తెలియజేశారు. వరంగల్ జిల్లా నూతన అధ్యక్షులు శ్రీ ఈదునూరి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అదేవిధంగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010పద్దుకింద జీతాలు అందించాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు టైమ్ స్కేల్ అందించాలని, గురుకుల పాఠశాలలకు పనివేళలో మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన చెన్నారావుపేట మండల పిఆర్టియు టీఎస్ కుటుంబ సభ్యులందరికీ పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలి.-మంత్రి సీతక్క

### విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేసిన మంత్రి, కలెక్టర్. గిరిజన సంక్షేమ, షెడ్యూల్ కులముల బాలికల వసతి గృహాల సందర్శన. హాస్టల్ల నిర్వహణ తీరుపై సంతృప్తి వెలిబుచ్చిన మంత్రి.



ఏటూరునాగారం(ములుగు)**(గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: వసతి గృహాల్లో విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మరియు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సూచించారు. బుదవారం



ములుగు జిల్లా కేంద్రం లోని గడిగడ్డ గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహం ను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మరియు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క విద్యార్థులతో మాట్లాడి వసతి, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. చదువు ఎలా సాగుతోందని విద్యార్థులను అడిగారు. మంచి విద్యను అభ్యసించాలని సూచించారు. భోజనం ఎలా వుంది, అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనుమతి లేకుండా విద్యార్థినులు బయటకు వెళుతున్నారా అని వార్డను అడిగారు. ఈ సందర్భంగా మంత్రి, కలెక్టర్ విద్యార్థినిలతో కలసి అల్పాహారం చేశారు. అతిథిగా వచ్చి తమతో పాటు కింద కూర్చుని మంత్రి, కలెక్టర్ భోజనం చేయడంతో ఆ విద్యార్థినుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఇస్తున్నారా? లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అల్పాహారం నాణ్యతను పరిశీలించెందుకు విద్యార్థులతో పాటు కింద కూర్చొని వారితో ముచ్చటిస్తూ భోజనం చేశారు. ఉప్మా బాగుందని, రోజూ ఇలాగే మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన అల్పాహారం, భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. హాస్టల్లో ఉన్న ఖాళీ స్థలంలో షెడ్డును (డైనింగ్ హాల్) నిర్మిస్తే విద్యార్థినిలు అల్పాహారం, భోజనం చేసేందుకు అనువుగా ఉంటుందని దసరా సెలవుల్లో షెడ్ నిర్మించాలని మంత్రి తెలిపారు. అనంతరం మంత్రి ప్రక్కనున్న షెడ్యూల్ కులముల బాలికల వసతి గృహం ను సందర్శించారు. విద్యార్థులను పలుకరించి వారికి అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలు, రోజువారీ దినచర్య గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలు భోజనం చేసేందుకు డైనింగ్ హాల్ లేదని నిర్వాహకులు మంత్రి కి తెలుపగా, ఖాళీ స్థలంలో దసరా సెలవుల్లో షెడ్ (డైనింగ్ హాల్) ను నిర్మించాలని మంత్రి తెలిపారు. ఇంకనూ ఏమైనా మౌలిక సదుపాయాలు అవసరం ఉన్నట్లయితే కలెక్టర్ దృష్టికి తీసుకుని రావాలని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ టి డి ఓ దేశిరాం, జిల్లా షెడ్యూల్ కులాల అధికారి బానోత్ లక్ష్మణ్, డివి హెచ్ ఓ



కొమురయ్య, డి డబ్లు ఓ ఇంచార్జీ శిరీష, డి పి ఓ దేవ్ రాజ్, ఎం.పి.డి. ఓ రామకృష్ణ, తహసిల్దార్ విజయ భాస్కర్, ఐ టి డి ఓ ఎస్ ఓ రాజ్ కుమార్, ఎంపి ఓ రహీం,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లాలో ఆయుష్ యోగ ఇన్స్ట్రక్టర్ల భర్తీ

ఏటూరునాగారం (ములుగు) **(గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: రాష్ట్రవ్యాప్తంగా 842 యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి ఆయూష్ శాఖ నుంచి రిక్రూట్ మెంట్ నోటిఫికేషన్ జారీ చేయబడినది. ఇందులో భాగంగా తెలంగాణలో ఉన్న ప్రభుత్వ 421 ఆయుష్ ఆస్పత్రులకు గాను 842 యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ ఉద్యోగాలను పార్ట్ టైం పద్ధతిలో రిక్రూట్ చేయనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 842 ఉద్యోగాలు ఉండగా, ఇందులో 421 పోస్టులను పురుష అభ్యర్థులతో భర్తీ చేస్తారు. మరో 421 పోస్టులకు ఫీమేల్ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సెషన్ల వారీగా విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది. ప్రతి సెషన్ కూడా గంటసేపు ఉంటుంది. ఒక్కో సెషన్‌కు రూ.250 చొప్పున రెమ్యునరేషన్ చెలిస్తారు. అంటే పురుష యోగా ఇన్‌స్ట్రక్టర్లుకు నెలకు రూ. 8వేల వరకు, ఫీమేల్ యోగా ఇన్‌స్ట్రక్టర్లు నెలకు రూ. 5వేల వరకు పొందవచ్చు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను https://ayush.telangana.gov.in/ వెబ్ సైట్ లో చూడొచ్చు.

### ములుగు జిల్లా వివరాలు:

ములుగు జిల్లాలో గల నాలుగు ఆయుష్ ఆస్పత్రులలో యోగా సెంటర్లను ఆయుష్ డిపార్ట్మెంట్ నెలకొల్పింది. అవి నరసాపురం, ఏటూరునాగారం, తాడ్వాయి, చుంచుపల్లి. ఈ గ్రామాలలో ఇప్పటికే యోగా షెడ్డు నిర్మించడం జరిగినది. ప్రతి సెంటర్కు గాను ఒక పురుష మరియు స్త్రీ ఇన్స్ట్రక్టర్ను నియమించడం జరుగుతుంది. వారు ఉదయం లమరియు సాయంత్రం యోగా తరగతులు నిర్వహించవలసి ఉంటుంది.

విద్యార్హతలు:

కనీస విద్యార్హత ఇంటర్మీడియట్ చదివి ఉండాలి, యోగా సర్టిఫికెట్ కోర్స్ చేసి ఉండాలి, ప్రథమ ప్రాధాన్యత సెంటర్కు దగ్గరగా ఉన్న వారికి ఇవ్వబడును.ఈ పోస్టులను కేవలం విద్యా అర్హతలు, ఇంటర్వ్యూ ఆధారంగా భర్తీ చేస్తారు.ఈనెల 27న వరంగల్ లో వాకిన్ ఇంటర్వ్యూలు నిర్వహించబడును. జిల్లా వ్యాప్తంగా అర్హులైన పురుష, మహిళ యోగ ఇన్స్ట్రక్టర్లకు ఈనెల 27వ తేదీన ఉదయం 10:00 గంటలకు వరంగల్ లోని రైల్వే స్టేషన్ ముందుగల ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో ఆయుష్ కమిషనర్ మరియు ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించ నున్నట్లు, అర్హులైన యోగ ఇన్స్ట్రక్చర్లు వారి యొక్క సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కాగలరు.

## మినీ జాతర పనులు ప్రధాన జాతరకు పనికి వచ్చేలా చెయ్యాలి

### :: రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క



ఏటూరునాగారం (మేడారం) **(గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: మినీ మేడారం జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయండి. నూతన పనులను నాణ్యతతో చేయాలి. మిగిలిన పెండింగ్ బిల్లును వెంటనే చెల్లిస్తాం. వచ్చే సంవత్సరం ఫిబ్రవరి మాసంలో జరిగే మినీ మేడారం జాతరను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, మినీ జాతర పనులు మహా జాతరకు ఉపయోగపడేలా



ఉండాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, ఎస్పీ శబరీష్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి రానున్న మినీ మేడారం జాతరపై సంబంధిత అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నప్పటికీ ఆయా పనులు శాశ్వతంగా ఉండకపోవడం వల్ల మరల అవే పనులు చేపట్ట వలసివస్తున్నదని ఇప్పటినుండి చేపట్టే పనులు దీర్ఘకాలంగా ఉండే విధంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం స్వర్స్ పథకాన్ని ప్రవేశపెట్టిన దృశ్య జాతరకు నిధులు వచ్చే అవకాశం ఉందని, జాతరకు విడుదలయ్యే నిధులతో గద్దెల చుట్టూ ఫ్లోరింగ్ చేయడంతో పాటు నిత్యం మంచినీటిని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతర సమయంలో కోట్లాదిమంది భక్తులు రావడమే కాకుండా సెలవు దినాల్లో సైతం వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుండి మేడారం చేరుకుంటున్నారని, వారికి సైతం వసతులు కల్పించాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగం పై ఉందని అన్నారు. గతంలో జాతరలో పనిచేసిన అధికారుల సూచనలు సలహాలను జిల్లాలో బాధ్యతలు చేపట్టిన కొత్త అధికారులు తీసుకోవాలని, తాను మంత్రి అయినప్పటికీ స్థానిక ఎమ్మెల్యేగా జాతర అదనపు నిధులు తేవడానికి కృషి చేస్తానని అన్నారు. భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసిన పక్షంలో ములుగు జిల్లాలో జిల్లా అధికారులను భక్తులు ఎన్నటికీ మర్చిపోలేరని, ములుగు జిల్లాకు డైనమిక్ కలెక్టర్ రావడం జిల్లా ప్రజల అదృష్టమని హర్షం వ్యక్తం చేశారు. 2024 లో జరిగిన మహా జాతర సందర్భంగా చేపట్టిన పనులకు నిలిచిపోయిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించడానికి చర్యలు తీసుకుంటానని, మేడారంలో చేపట్టే పనులు శాశ్వతంగా ఉండే విధంగా అన్ని శాఖల అధికారులు చొరవ చూపాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సిహెచ్. మహేందర్ జి, సంపత్ రావు ( ఇన్చార్జి ), ఎండోమెంట్ ఈ ఓ రాజేందర్, డి ఎం అండ్ హెచ్ ఓ అప్పయ్య,పీఆర్, ఆర్ అండ్ బి, ట్రైబల్ వెల్ఫేర్, ఇర్రిగేషన్, ఆర్ డబ్లు , విద్యుత్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు శుద్ధి చేసిన మంచి నీటిని అందించాలి

### - రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి.




ఏటూరునాగారం(మేడారం)**(గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: జిల్లాలోని అన్ని గ్రామాల ప్రజలకు శుద్ధి చేసిన మంచినీటిని అందించేందుకు సంబంధిత అధికారులు బాధ్యతయుతంగా పనిచేయాలని, కలిసికమైన మంచినీటిని అందించిన పక్షంలో పలు రకాల వ్యాధుల బారిన పడవలసి వస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి మంత్రి సీతక్క గ్రామీణ మంచినీటి సహాయకులు, నీటి నాణ్యత, పరిరక్షణ అనే శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మంచినీటి సరఫరా ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా రాష్ట్రవ్యాప్తంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, నేటి నుండి నాలుగు రోజులపాటు జరిగే ఈ శిక్షణా కార్యక్రమంలో సంబంధిత శాఖ సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. గ్రామీణ మంచినీటి శాఖ అధికారులు నిత్యం గ్రామాలలో పర్యటిస్తూ నీటి సరఫరా పై దృష్టి సారించాలని, పైపులైలను పరిశీలించి నీటిని సరఫరా చేయాలని సూచించారు. కలుషితమైన నీటిని సేవించడం వలన అనేక గ్రామాల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, మూత్రపిండాలు చెడిపోవడం, క్యాన్సర్ లాంటి వ్యాధులు సోకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సరఫరా విషయంపై ఎలాంటి ఆరోపణలు వచ్చిన సంబంధిత అధికారులు వెంటనే పత్రికా ముఖంగా వివరణ ఇవ్వాలని, కొందరు కావాలనే ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. మానవునికి గాలి ఎంత అవసరమో శుద్ధమైన మంచినీటిని సేవించడం అంత అవసరమని ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు అంకితభావంతో పనిచేయాలని అన్నారు. ప్రభుత్వం మంచినీటి కోసం విడుదల చేస్తున్న ప్రతి పైసా ప్రజలకు ఉపయోగపడే విధంగా అధికారులు చూసుకోవాలని, నామమాత్రంగా నిర్లక్ష్యంగా పనులు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ములుగు నియోజకవర్గంలోని కొత్తగూడ, గంగారం మండలాలకు మంచినీటి సరఫరా చేయడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని, జిల్లాలోని కొన్ని మండలాల్లో సైతం పనులు పూర్తి చేసి నీటిని అందించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సిహెచ్. మహేందర్ జి, సంపత్ రావు ( ఇన్చార్జి ), ఆర్ డబ్లు ఎస్ ఈ మల్లేశం, ఈ ఈ మాణిక్యం, డి ఈ సునిత, జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, ములుగు, వెంకటపూర్ మండలంలోని గ్రామాల మంచి నీటి సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లు వెంటనే చెల్లించాలి

## కొయ్యగూడెం ప్రాజెక్ట్ ఆఫీసర్ కి వినతిపత్రం



టేకులపల్లి **(గౌతమ్ న్యూస్):** కోయగూడెం ఓపెన్ క్యాస్ట్ లో. ఎల్ ఎస్ ఎన్ మినరల్స్ ప్రైవేట్ కంపెనీ లో పని చేయుచున్న కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు కొయ్యగూడెం ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ని కలిసి వినతి పత్రం అందజేయటం జరిగింది. గత సంవత్సరం నుండి ఎల్ ఎస్ ఎన్ కంపెనీ. కార్మికులకు ప్రతి నెల సకాలంలో జీతాలు చెల్లిచడం లేదు సింగరేణి సంస్థ బిల్లులు ఆలస్యం గా అవటం వలన జీతాలు ఒక నిర్థిష్టమైన తేదీ న, ఇవ్వలేకపోతున్నాము అని ఎల్ ఎస్ ఎన్ యాజమాన్యం కంపెనీ కార్మికులకు ప్రతి నెల చెబుతావుంది. ఆగస్టు నెల జీతం ఈ రోజు వరకు ఇవ్వక పోవటం వలన కార్మికులు తీవ్ర మైన ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఈ విషయం పై కోయగూడెం ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ని కార్మికులందరు కలిసి ప్రతి నెల మొదటి వారం లోపు జీతాలు చెల్లించేల చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలనీ ఐ ఎన్ టి యు సి ఓబి %ం% కోల్ యూనియన్ తరుపున వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమం లో యూనియన్ సభ్యులు, వివిధ శాఖల కార్మికులు పాల్గొనటం జరిగింది.

## నిషేధిత గంజాయి పై అవగాహన సదస్సు



టేకులపల్లి **(గౌతమ్ న్యూస్):** ఈరోజుగంజాయి మరియు ఇతర డ్రగ్స్ కారణంగా ఎలాంటి ఆరోగ్య పరమైనా, ఆర్థిక పరమైన మరియు చట్ట పరమైన సమస్యలు వస్తాయో వివరించి, ఎలాంటి సమాచారం ఉన్నా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి వివరాలు గొప్యం గా ఉంచుబడును అని తెలిపినారు , ఇంట్లో పిల్లల ప్రవర్తన లో మార్పు కనిపిస్తే తల్లి దండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని బోడు ఎస్సై శ్రీకాంత్ స్థానికులకి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. మాదకద్రవ్యాల ద్వారా ప్రాణ ఆస్తి ఆరోగ్యం నష్టం వాటితోందని, వాటి జోలికి వెళ్లకుండా యువత సన్మార్గంలో నడవాలని అన్నారు, ఈ కార్యక్రమంలో బోడు పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు యువత పాల్గొన్నారు.

## పోషకాభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య






టేకులపల్లి **(గౌతమ్ న్యూస్):** టేకులపల్లి మండలం బోడు సెక్టార్ రైతు వేదిక లొ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషక ఆహార మాస వారోత్సవాలు కార్యక్రమం లొ ముఖ్య అతిధిగా ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య పాల్గొని అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు, అనంతరం పోషక అభియాన్ లో భాగంగా పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. బాలా అమృతం పిల్లలకు ఎలా పెట్టాలి ఎన్ని రకాలుగా చేసి తినిపించవచ్చు, కూల్ డ్రింక్స్, జింక్ తో కూడిన తిని పదార్థాలు గర్భవతులు, బాలింతలు,పిల్లలు తినకూడదని మంచి పోషకాలు ఉన్న ఆహారం తినడం ద్వారా తల్లులు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు, పోషకాలు విలువలు వంటకాలు తయారు చేసుకుని ప్రదర్శించారు అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు .



ఈ కార్యక్రమంలో, తహసిల్దార్ నాగ భవాని, సిడిపిఓ ఎం తార, సూపర్వైజర్స్, ఎండి ఖలేజా, లక్ష్మి, బి. నార్మలా, యశోద, అనురాధ, అంగన్వాడి టీచర్లు మరియు ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

## అఖిలపక్ష నాయకుల అక్రమ అరెస్టులను ఖండించండి

### అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలి

### అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు

బయ్యారం **(గౌతమ్ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో రోడ్ సెంటర్లో సీఎంసి.స్థలం మండల అభివృద్ధి కోసం గోగినేని వెంకటేశ్వరరావు 1840 గజాల దానంగా ఇచ్చి దాన పత్రం రాయించి ఇవ్వడం జరిగింది. అట్టి స్థలమును బయ్యారం మండల అభివృద్ధి కోసం వినియోగించుకోవాలని అన్ని రాజకీయ పార్టీల నిర్ణయించుకొని ఆ స్థలానికి చుట్టూ ఫినిషింగ్ కూడా చేయించి ఉన్న స్థలాన్ని. కొంతమంది రియల్ ఎస్టేట్ బ్రోకర్స్ స్థలాన్ని కాజేయడం కోసం అనేక ప్రయత్నాలు కొనసాగిస్తున్న స్థితిలో ఈ స్థలాన్ని మండల అభివృద్ధి కోసం వినియోగించుకోవాలని. అఖిలపక్ష నాయకులు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య ని మంత్రులను కలిసి విన్నవించిన ఫలితం లేక మండల అభివృద్ధి స్థల రక్షణ కోసం శాంతియుతంగా ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించగా దీన్ని గమనించిన బయ్యారం పోలీసులు ముందస్తు ఇండ్ల దగ్గర ఉన్న నాయకులను అక్రమంగా అరెస్టు చేసి గార్ల. బయ్యారం స్టేషన్లలో నిర్బంధించడం అనాగరిక చర్య అని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు అన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే మంత్రులు ఉన్నతాధికారుల జోక్యం చేసుకొని మండల అభివృద్ధికి కేటాయించిన సిఎంసి స్థలాన్ని కి తగిన రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం. మండల అభివృద్ధి కోసం కేటాయించిన స్థలాన్ని కొనుగోలు చేసిన బ్రోకర్లపై తగిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం అరెస్టు చేసిన అఖిలపక్ష నాయకుల్ని అందరిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

## రైతులకు బీజేపీ ద్రోహం చేసింది - జైరాం రమేష్



**న్యూఢిల్లీ,:** ఎన్నికల నేపథ్యంలో హర్యానాలో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీపై ప్రశ్నల వర్షం కురిపించారు కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్. రైతుల సమస్యలను బిజెపి ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. రైతుల గౌరవప్రదమైన జీవనం, అభివృద్ధిపై బీజేపీకి ఉన్న విజన్ ఏంటి..? అని ప్రశ్నించారు. రైతులకు బీజేపీ ద్రోహం చేసిందని మండిపడ్డారు జైరాం రమేష్. మోడీ ప్రభుత్వంపై హర్యానా ప్రజలు నమ్మకం కోల్పోయారని అన్నారు. 2021 లో సాగు చట్టాలు రద్దు చేసిన తర్వాత కేంద్రం రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి..? వారి డిమాండ్లు తీరుస్తామని ఎక్కడికి వెళ్లారు..? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. హర్యానాలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కనీస మద్దతు ధరపై చట్టపరమైన హామీ ఇస్తుందన్నారు. అంతేకాకుండా రుణమాఫీ తో పాటు 30 రోజులలోగా పంట బీమా కూడా చెల్లిస్తామని పేర్కొన్నారు. ఇక లైంగిక వేధింపులకు పాల్పడే వారికి బిజెపి ఆశ్రయం కలిగిస్తుందని విమర్శించారు జైరాం రమేష్. హర్యానా మహిళా రెజ్లర్లపై బీజేపీ నుంచి ఎంపీగా గెలిచిన బ్రిజ్ భూషణ్ వేధింపులకు పాల్పడ్డాడని.. అతడిని శిక్షించకుండా అతని కుమారునికి టికెట్ ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు.

# పదోన్నతుల్లో పదనిసలు...రిజర్వేషన్ అమలుకాని వైనం




అన్ని ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగాలలో SC/ST/Disabled persons సరిపడినంత లేనందున ఆ వర్గాల వారికి పదోన్నతుల్లో రిజర్వేషన్లను రాజ్యాంగం కల్పించింది. వీటిపై స్పష్టమైన అవగాహన లేక అక్కడక్కడ రిజర్వేషన్లు అమలు పరచడం జరగడం లేదు. దేశంలో అట్టడుగు, అణగారిన వర్గాల వారి ప్రాతినిధ్యం తగినంతగా లేనందున వారికి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో భారత రాజ్యాంగం అనేక వెసులుబాటులు కల్పించింది. 85వ రాజ్యాంగ సవరణ ద్వారా మార్పు చేయబడిన భారత రాజ్యాంగంలోని 18(4ఏ)నిబంధన ప్రభుత్వ ఉద్యోగాలలో ఎస్సీ, ఎస్టీలు సరిపడనంతగా లేనప్పుడు ఆయా రాష్ట్రాలు ఈ వర్గాల వారికి పదోన్నతుల్లో రిజర్వేషన్ను అమలు చేయుటకు వీలు కల్పించింది. దీనికి అనుగుణంగా మన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల సంఖ్య 5 సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ తేదీ 14.2.2003 ద్వారా అన్ని శాఖల్లోని వివిధ రకాలైన పోస్టుల పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించింది. ఉత్తర్వుల సంఖ్య 21 సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ తేదీ 18. 3. 2003, అట్లే ఉత్తర్వు సంఖ్య 2 సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ తేదీ 9.1. 2004 ద్వారా రిజర్వేషన్ అమల్లో వివరణాత్మక ఉత్తర్వులు కూడా జారీ చేయడం జరిగింది.

### ప్రమోషన్లు ఎలా వర్తిస్తాయంటే?

పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు, పంచాయతీరాజ్, మున్సిపాలిటీలు, బోర్డులు, కార్పొరేషన్లు, గ్రంథా లయ సంస్థలు, మార్కెట్ కమిటీలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వర్తిస్తాయి. పదోన్నతులలో రిజర్వేషన్లు అన్ని సర్వీస్‌లోని పోస్టులకు వర్తిస్తాయి. కానీ ఒక పోస్ట్ యొక్క క్యాడర్ సంఖ్య 5 కంటే ఎక్కువ ఉన్నప్పుడే ఈ రిజర్వేషన్ను అమలు చేయాలి. ఇట్టి రిజర్వేషన్ 14.2.2003 నుండి ఇవ్వబడే పదోన్నతులకు మాత్రమే వర్తిస్తాయి. అమల్లో ఉన్న 100 రోస్టర్ పాయింట్ల పట్టికను పదోన్నతులలో కూడా వర్తింప చేయాలి. పదోన్నతుల్లో కూడా ఎస్సీలకు 15%, ఎస్టీలకు 6% రిజర్వేషన్ కల్పించారు. రిజర్వేషన్లు సర్వీస్ నిబంధనల ప్రకారం ఆయా పోస్టులకు అర్హత గలవారికి వర్తిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వ సబ్ ఆర్డినేట్ సర్వీస్ నిబంధన 22 దాన్ని షరతులు అన్ని పదోన్నతుల రిజర్వేషన్‌కు వర్తిస్తాయి.

### ఎస్సీ, ఎస్టీలకే పదోన్నతి!

ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నెలను ప్రామాణికంగా తీసుకుని సదరు తేదీ నాటికి ప్రతి క్యాడర్లోను ఎస్సీకి 15%, ఎస్టీలకు 6% ఉన్నారా లేరా? అనే విషయాన్ని గమనించి సూచించిన శాతం లేనట్లయితే రిజర్వేషన్ను అమలు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ 14.2.2003 నాటికి ఎస్సీలు 15%, ఎస్టీలు 6% ఉన్నను లేదా తర్వాతి కాలంలో సదరు కోట నిండినట్లయితే మరల ఆ క్యాడర్‌లో రిజర్వేషన్ పాటించవద్దు. ఎస్సీలు 15%, ఎస్టీలు 6% ప్రాతినిధ్యంకై ఇదివరలో సీనియార్టీ ప్రకారం పదోన్నతులు పొందినా పరిగణలోకి తీసుకొని లెక్కించాలి. తగినంత ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు సీనియార్టీ లిస్టులో లేనట్లయితే డిపార్ట్మెంటల్ పరీక్షలు, కనీస సర్వీసెస్ వంటి అర్హతలు కలిగిన అభ్యర్థులు ఏ స్థానంలో ఉన్నా, వారిని పైకి తెచ్చి ఎస్సీ, ఎస్టీలకు కేటాయించబడిన రోస్టర్ పాయింట్లలో సర్దుబాటు చేసి పదోన్నతి కల్పించాలి. సీనియార్టీ లిస్టులో ఎస్సీ, ఎస్టీలు ఉండి పదోన్నతి పొందుతుంటే ఎస్సీ, ఎస్టీలకు కేటాయించబడిన రోస్టర్ పాయింట్లు వారితో నిండినట్లుగా భావించాలి.

### క్యారీ ఫార్వర్డ్ చేయడం..

ఒక ప్యానెల్ సంవత్సరంలో సరిపడినంత మంది ఎస్సీ, ఎస్టీలు లేనట్లయితే సదరు ఖాళీలను తదుపరి సంవత్సరానికి క్యారీ ఫార్వర్డ్ చేయాలి. మరల రెండవ ప్యానల్ సంవత్సరంలో కూడా ఎస్సీ, ఎస్టీలు లేనట్లయితే ఆ ఖాళీలను కేటాయించబడిన రోస్టర్ పాయింట్లను మెరిట్ కం, సీనియారిటీ ప్రాతిపదికన భర్తీ చేయాలి. ఈ విధంగా ఇతరులతో భర్తీ చేయబడిన ఖాళీలను మరల మూడవ ప్యానల్ సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీలతోనే భర్తీ చేయాలి. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించబడిన రోస్టర్ పాయింట్లలో అర్హులైన మహిళ అభ్యర్థినులు లేనట్లయితే, సదర ఖాళీలను ఎస్సీ, ఎస్టీ పురుష అభ్యర్థులతో భర్తీ చేయవచ్చు. ఆయా క్యాడర్లకు రిజర్వేషన్ లెక్కించటలో ఏర్పడిన శేషం 0.5 లేదా అంతకంటే ఎక్కువ ఉంటే దాన్ని ఒకటిగా పరిగణించాలి. ఉదాహరణకు ఒక కేడర్ యొక్క మొత్తం పోస్టులు 25 అనుకుంటే ఎస్సీ వారికి 15% చొప్పున 3.75ను 4 గా, ఎస్టీ వారికి 6% చొప్పున 1.5 ను 2గా పరిగణిస్తూ ఖాళీలను నింపాలి. ఎస్టీలకు సంబంధించి ఏదైనా క్యాడర్లో మొత్తం పోస్టుల సంఖ్య 6 లేక 7 ఉన్నను 1 పోస్ట్ వారికి ఉన్నట్లుగానే భావించి రోస్టర్ ప్రకారం వారి వంతు వచ్చినప్పుడు పదోన్నతి కల్పించాలని ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 4 సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ తేదీ 2.1. 2007 ద్వారా తెలియపరిచారు. డిజేబుల్ పర్సన్స్‌కు కూడా పదోన్నతుల్లో మూడు శాతం రిజర్వేషన్ ప్రభుత్వం వారు జీవో 42 తేదీ 19.10. 2011 ద్వారా కల్పించారు. 100 రోస్టర్ పాయింట్లలో ఆరు 31 56ను ఏర్పాటును తెలియజేశారు. తదుపరి 3% నుంచి 4% రిజర్వేషన్లు పెంచారు. అట్లే వారికి 82వ పాయింట్‌ను కూడా రోస్టర్‌లో కేటాయించారు.

### పదోన్నతికి..

సరిపడనంత డిజేబుల్ క్యాండిడేట్స్ ఫీడర్ కేటగిరీలో లేనట్లయితే వారికి కేటాయించబడిన రోస్టర్ పాయింట్లను ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం క్యారీ ఫార్వర్డ్ చేయడం, ఇతర డిసేబుల్డ్ కేటగిరి వారితో నింపాల్సి ఉంటుంది. చాలా ప్రభుత్వ శాఖల యందు శాఖ అధికారులు పదోన్నతుల విషయంలో ఎస్సీ, ఎస్టీ, డిజేబుల్ పర్సన్స్‌కు సంబంధించి స్పష్టమైన ఉత్తర్వులు, వివరణలు ఉన్ననూ వారికి సరైన అవగాహన లేక కొన్ని సందర్భాల్లో అవసరం లేకున్నా పదోన్నతి కల్పిస్తున్నారు. ఉదాహరణకు ఆ శాఖకు చెందిన క్యాడర్ స్ట్రెంత్ అనుసరించి ఆయా వర్గాలకు అనగా ఎస్సీ, ఎస్టీ, డిజేబుల్ పర్సన్స్‌లకు చెందిన సరిపడు ఉద్యోగులు ఉన్నారా? లేదా అనేది నిర్ధారించుకొని పదోన్నతులు కల్పించవలసి ఉంటుంది. కానీ ఇవి పాటించకుండా ఎక్కువగా పదోన్నతులు కల్పిం చడం కూడా జరిగినది. అట్లే కొన్ని శాఖలలో ప్రిన్సిపల్ ఆఫ్ అడిక్వసీ అంటే సరిపడినంత ఆయా వర్గాలకు చెందిన వారు లేకున్నా పదోన్నతులు కల్పించవలసి ఉన్నందున కూడా వాళ్ల రోస్టర్ పాయింట్ వచ్చేవరకు ఆగి పదోన్నతులు కల్పిం చడం జరుగుతున్నది. ఈ రెండు కూడా సరైన పద్ధతులు కావు. పదోన్నతులు ఇచ్చునాటికి ప్రిన్సిపుల్ ఆఫ్ అడిక్వసీ ఫుల్ ఫీల్ అయినదా? లేదా అనేది నిర్ధారించుకొని ఎంతమంది అయితే తక్కువగా ఉన్నారో అంత మందికే పదోన్నతులు కల్పించాల్సి ఉంటుంది. అప్పుడు మాత్రమే పదోన్నతుల రిజర్వేషన్ విషయంలో సమతుల్యత పాటించినట్లు అవుతుంది.

# ద్వీపంలో పొడిచిన అరుణతార



శ్రీలంక గణనీయమైన ఆర్థిక సవాళ్లు, రాజకీయ అనిశ్చితితో పోరాడుతూనే ఉంది, మార్పు కోరుకునే అనేక మంది పౌరులకు ఆశాచిహ్నంగా ఉద్భవించింది. 55 ఏళ్ల వయసులో, దేశంలోని దీర్ఘకాలంగా వేళ్నూనుకున్న రాజకీయ ప్రముఖులచే భ్రమింపబడిన వారి ఆకాంక్షలను సాకారం చేసే ప్రముఖ నాయకుడిగా అనుర కుమార దిసానాయకే ఇప్పుడు నిలిచారు. శ్రీలంకకు అనురాకుమార్ దిసనాయకే తొమ్మిదో అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. గత ఎన్నికల్లో కేవలం మూడు శాతం ఓట్లు మాత్రమే సాధించిన ఆయన.. ఈ ఎన్నికల్లో మార్పు, అవినీతి వ్యతిరేక సమాజ నిర్మాణం వంటి నినాదాలతో విస్తృతంగా ప్రచారం చేసి అపూర్వ జనాదరణ పొందారు.

### ఎవరీ దిసనాయకే..?

విద్యార్థి నేతగా మొదలై.. దేశాధినేత వరకు ఎదిగిన దిసనాయకే శ్రీలంక రాజకీయాల్లో ఓ సంచలనం! 1968 నవంబర్ 24న కొలంబోకు 100 కి.మీ దూరంలో ఉన్న తంబుట్టెగామలో కార్మిక కుటుం బంలో ఆయన జన్మించారు. స్థానికంగానే పాఠశాల విద్యనభ్యసించిన దిసనాయకే.. తమ గ్రామం నుంచి యూనివర్సిటీలో ప్రవేశం పొందిన తొలి విద్యార్థి కావడం విశేషం. తొలుత పెరదేనియా విశ్వవిద్యాలయంలో చేరగా.. రాజకీయ సిద్ధాంతాల కారణంగా ఎదురైన బెదిరింపులతో కెలానియా విశ్వవిద్యాలయానికి బదిలీ అయినట్లు గతంలో ఆయన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ గ్రాడ్యుయేట్ పట్టా అందుకున్న ఆయన.. ఆ తర్వాత సోషలిస్టు స్టూడెంట్స్ అసోసియేషన్ లో చేరి విద్యార్థి రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించారు.

### రాజకీయ జీవితం ఇలా..

1987లో మార్క్సిస్టు ప్రభావిత జనతా విముక్తి పెరమునా లో చేరిన దిసనాయకే.. తన రాజకీయ పునాది నిర్మించుకున్నారు. 1998 నాటికి జేవీపీ నిర్ణయాధికార విభాగం పొలిట్ బ్యూరోలో చోటు దక్కించుకున్నారు. 2000లో ఎంపీ అయిన దిసనాయకే.. 2004లో శ్రీలంక ఫ్రీడమ్ పార్టీతో కలిసి జేఎన్‌పీపీ ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. చంద్రికా కుమారతుంగ ప్రభుత్వంలో ఆనాడు వ్యవసాయ, నీటిపారుదల శాఖ మంత్రిగా సేవలందించారు. 2005లో సునామీ సహాయక సమన్వయం కోసం ప్రభుత్వం, ఎల్టీటీఈ మధ్య ఉమ్మడి ఒప్పందంపై అంగీకారం కుదరకపోవడంతో తలెత్తిన విభేదాలతో తన మంత్రి పదవికి రాజీనామా చేశారు.

### అవినీతి వ్యతిరేక పోరాట గళం

శ్రీలంకలో 2022లో తలెత్తిన ఆర్థిక సంక్షోభం తర్వాత ప్రజల అసంతృప్తిని ఆయుధంగా మలచుకొని సమరశంఖం పూరించారు. మార్పు, అవినీతి వ్యతిరేక సమాజ నిర్మాణం వంటి నినాదాలతో విస్తృతంగా ప్రచారం చేసి అపూర్వ జనాదరణ పొందారు. వ్యవస్థాగత మార్పు కోసం నినదించారు. ఎన్నికల ప్రసంగాల్లో గత పాలకుల అవినీతి, వైఫల్యాలను ఎత్తిచూపుతూనే.. జవాబుదారీతనం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఆర్థిక సంక్షోభానికి మూల కారణాలను పరిష్కరించడంలో గత పాలకుల వైఫల్యాలను ఎత్తి చూపారు. అంతేకాకుండా తమ పార్టీ మ్యానిఫెస్టోలో విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేయడంతో పాటు అనేక ప్రజా సంక్షేమ విధానాలతో ప్రజల్ని తనవైపు ఆకట్టుకోవడంలో విజయవంతమయ్యారు. శ్రీలంక ఆర్థిక సంక్షోభం, రాజపక్స రాజీనామా వంటి పరిణామాలతో ఏర్పడిన నాయకత్వ శూన్యత, ప్రజల్లో నిరుత్సాహం కమ్ముకొని ఉన్న పరిస్థితుల్లో వ్యవస్థలో మార్పు రావాలని కోరుకుంటున్న యువతను.. అవినీతి వ్యతిరేక వైఖరితో ఆకట్టుకోవడంలో దిసనాయకే సఫలీకృతులయ్యారు.

### అంతర్జాతీయ సహకారం అవసరం!

ద్రవ్యోల్బణం, విదేశీ మారక నిల్వలు దాదాపుగా ఖాళీ అవ్వడం, వైద్య సామాగ్రి కొరత, ప్రాథమిక వస్తువుల ధరల పెరుగుదల వంటి పర్యవసానాలు తలెత్తాయి. విపరీతంగా నోట్ల ముద్రణ, సేంద్రియ లేదా జీవ వ్యవసాయానికి మారడానికి తీసుకొచ్చిన దేశవ్యాప్త విధానం, 2019లో జరిగిన ఈస్టర్ బాంబు దాడులు, కోవిడ్-19 మహమ్మారి వంటి బహుళ కారణాల వల్ల ఈ సంక్షోభం ప్రారంభమైంది. ఈ ఆర్థిక కష్టాలు 2022లో ప్రజల నిరసనలకు దారితీసాయి. ప్రజల ప్రతిభను, జ్ఞానాన్ని వినియోగించుకుని దేశాన్ని నడిపించేందుకు మెరు గైన నిర్ణయాలు తీసుకోవడమే తన కర్తవ్యం. రాజకీయ స్థిరత్వాన్ని ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడం కోసం, రాజకీయ స్థిరత్వాన్ని కొనసాగిస్తూ దేశంలోని దీర్ఘకాలంగా వేళ్నూనుకున్న అవినీతి ఆర్థిక అనిశ్చితి రూపుమాపి దేశ ప్రజల ఆకాంక్షలను సాకారం చేసే చర్యలు ద్వారా అనురా కుమార్ దిసనాయకే నాయకత్వం సరికొత్త దిశను చూపగలదు.

# యూట్యూబ్ న్యూస్ ఛానల్స్ యాజమాన్యాల మహాసభ....

29 న తెలంగాణ రాష్ట్ర యూట్యూబ్ న్యూస్ చానల్స్ యాజమాన్యాల నూతన కమిటీల నియామకాలు:

తెలంగాణ స్టేట్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు -టైగర్ ఆలీ, నవాబు



మహబూబాబాద్ బయ్యారం**(గౌతమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి అన్ని యూట్యూబ్ న్యూస్ చానల్స్ యాజమాన్యాలు ఈ యొక్క రాష్ట్ర నూతన కమిటీ నియామకాలకు నల్లగొండ జిల్లా నార్కట్ పల్లిలో వేస్తున్నట్లు రాష్ట్ర నలుమూలల ఉన్నా మన వాళ్ళందరూ తప్పకుండా హాజరు కావాలని, తెలంగాణ స్టేట్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, టైగర్ ఆలీ నవాబ్ బుధవారం రోజున ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా టైగర్ అలీ నవాబ్ మాట్లాడుతూ యూట్యూబ్ న్యూస్ చానల్స్ అంటే లెక్కలేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడే వారికి కనువిప్పు కలిగేలా మన న్యూస్ ఛానల్ యాజమాన్యాలు ఒక్క తాటిపై వచ్చి నూతన కమిటీల ద్వారా మనం అంటే ఏందో చూపించాల్సిన సమయం ఆసన్నమైంది అని,ప్రతి జిల్లాలో పని చేస్తున్న యూట్యూబ్ న్యూస్ చానల్స్ జర్నలిస్టులకు మీడియా అక్రిడియేషన్ కార్డులు ఇవ్వాలని,పది లక్షల రూపాయల ప్రమాద భీమ సౌకర్యం కల్పించాలని,నెలకు కానీస ఖర్చుల నిమిత్తం పది వేల రూపాయలు ఇవ్వాలని,ప్రతి ప్రైవేట్ స్కూల్,కాలేజీల్లో చదువుకునే పిల్లలకు ఫీజులో 50% పర్సెంట్ మాఫీ చేయాలని,అక్రమ కేసులు అనే ప్రస్తావన రాకుండా తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి చూడాలని ఆయన కోరారు.

## జపాన్‌ని అధిగమించి "మూడో శక్తివంతమైన" దేశంగా భారత్..



**న్యూఢిల్లీ,:** ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ఖ్యాతి పెరుగుతోంది. ఇప్పుడున్న ప్రపంచ సమస్యల పరిష్కారానికి భారత చొరవ లేకుండా ఏ దేశం కూడా ముందుకు వెళ్లలేని పరిస్థితి. ఆర్థికం బలపడటంతో పాటు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉండటం భారత్ గొప్పతనం. ఇదిలా ఉంటే "ఆసియా పవర్ ఇండెక్స్" రీజినల్ పవర్స్‌లో భారతదేశం సత్తా చాటింది. జపాన్‌ని దాటేసి మూడో అత్యంత శక్తివంతమైన దేశంగా అవతరించింది. ఆర్థిక పునరుద్ధరణ, మల్టీలాట్రల్ డిప్లమసీ భారత ప్రభావాన్ని మరింత పెంచింది. ప్రపంచంలో ఏ దేశానికి లేనట్టుగా భారత్ ఇటు రష్యాతో, అటు ఉక్రెయిన్‌తో స్నేహం చేయగలుతుంది. భారత్ ఆసియా పవర్ ఇండెక్స్‌లో మూడో స్థానానికి చేరడానికి బలమైన ఆర్థిక వృద్ధి, యువ జనాభా, ప్రాంతీయ భద్రతా విషయాలు ప్రధాన కారణాలయ్యాయి. ఇది భారత భౌగోళిక రాజకీయ స్థాయిని ప్రభావాన్ని పెంచడంతో పాటు మెరుగుపరుస్తుంది. "ఒక పెద్ద మార్పు, ఆసియా పవర్ ఇండెక్స్‌లో భారతదేశం జపాన్‌ను అధిగమించి మూడవ అతిపెద్ద శక్తిగా అవతరించింది, ఇది పెరుగుతున్న భౌగోళిక రాజకీయ స్థాయిని ప్రతిబింబిస్తుంది" అని మంత్రిత్వ శాఖ తెలిపింది. తొలి రెండు స్థానాల్లో అమెరికా, చైనా ఉన్నాయి. 2018లో లోవీ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభించిన ఆసియా పవర్ ఇండెక్స్, ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో పవర్ డైనమిక్స్ రేటింగ్స్ ఇస్తోంది. ఇది ఆసియా-పసిఫిక్ అంతటా 27 దేశాలను అంచనా వేస్తుంది. కోవిడ్ మహమ్మారి వల్ల అమెరికా, చైనా, యూరోపియన్ యూనియన్ దేశాల ఆర్థిక వ్యవస్థలు కూడా దెబ్బతిన్న తరుణంలో, భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం మెరుగ్గా ఉంది. ఇది కూడా పవర్ ఇండెక్స్ రేటింగ్‌కి కారణమైంది.

## కాశీ బోర్డులో అందరూ హిందువులే..
## వక్ఫ్‌లో ముస్లిమేతరులు ఎందుకు




**న్యూఢిల్లీ,:** వక్ఫ్ సవరణ బిల్లుపై ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ మరోసారి పలు ప్రశ్నలు సంధించారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ముంబైలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ముస్లింలకు సంబంధించిన వక్ఫ్ బోర్డు చట్టంపై బీజేపీ ప్రభుత్వం తప్పుడు అజెండాలు సృష్టించి.. ప్రచారం చేస్తుందన్నారు. 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలలో 9 లక్షల 40 ఎకరాల భూమి ఉందని.. కానీ ఇప్పటికీ ఈ భూమిని లాక్కున్నట్లు పుకార్లు వ్యాపిస్తూనే ఉన్నాయన్నారు. వక్ఫ్ ఆస్తులను కాపాడేందుకు కాదు.. వక్ఫ్ బోర్డును శాశ్వతంగా రద్దు చేసేందుకు బీజేపీ ప్రభుత్వం బిల్లును తీసుకొచ్చిందన్నారు. హిందూ మతంలో ఎవరైనా ఎప్పుడైనా విరాళం ఇవ్వవచ్చు.. కానీ ముస్లిం సమాజంలో ఎందుకు వివక్ష అని ప్రశ్నించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు కమిటీలో 8 నుంచి 9 మంది ముస్లిమేతరులను ఎందుకు నియమించాలనుకుంటున్నారు? అని అడిగారు. యూపీలోని కాశీ బోర్డులో సభ్యుడు తప్పనిసరిగా హిందువు అయి ఉండాలి అని స్పష్టంగా రాసి ఉందని.. కాబట్టి వక్ఫ్ బోర్డులోకి హిందువులను ఎందుకు తీసుకురావాలని ఒవైసీ ప్రశ్నించారు. తిరుపతి దేవస్థానం ప్రసాదంలో జంతువుల కొవ్వు ఉండటం వల్ల సమస్య ఏర్పడింది కానీ.. ముస్లిం మతంలో భాగమైన వక్ఫ్ బోర్డుపై ఎందుకు అలా స్పందించడం లేదు అని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా.. మరోవైపు వక్ఫ్ బిల్లుపై వచ్చిన కోటి మందికి పైగా ఫీడ్‌బ్యాక్‌పై బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే ఆందోళన వ్యక్తం చేశారు. వాస్తవానికి పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆగస్టు 8న వక్ఫ్ బిల్లు 2024ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ వంటి ప్రతిపక్షాలు ఈ బిల్లును ముస్లిం వ్యతిరేక బిల్లుగా అభివర్ణించాయి. విపక్షాల మధ్య ఈ బిల్లు లోక్‌సభలో ఎలాంటి చర్చ లేకుండానే జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపబడింది. బిల్లును మెరుగుపరచడానికి జేపిసి అభిప్రాయాన్ని కోరింది. ఇప్పటి వరకు 1.25 కోట్ల సూచనలు వచ్చాయి. అయితే, నిషికాంత్ దూబే ఫీడ్‌బ్యాక్ సంఖ్యపై ప్రశ్నలు లేవనెత్తారు. ఈ లెక్కలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని దూబే అన్నారు.

## హర్యానా మెగా ర్యాలీలో కాంగ్రెస్ పై విరుచుకుపడ్డ మోదీ



**న్యూఢిల్లీ,:** హర్యానాలో ఎన్నికల ప్రచారానికి మరికొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉంది. దేశంలోని అగ్రనేతలు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. బుధవారం సోనిపట్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ ప్రభుత్వం హర్యానాకు పెద్ద సహకారం అందిస్తుందన్నారు. కాంగ్రెస్ ఆశ్రిత పక్షపాతాన్ని పెంచుతోందని ఆరోపించారు. ప్రధాని తన ప్రసంగంలో రైతులు, దళితులు, కుటుంబ వాదాన్ని ప్రస్తావించారు. గోహనాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడుతూ.. హర్యానాలో ఓటింగ్ రోజు దగ్గరపడుతున్న కొద్దీ బీజేపీకి మద్దతు పెరుగుతోందని అన్నారు. కాంగ్రెస్ రాజకుటుంబం దేశంలో అత్యంత అవినీతి కుటుంబం. పార్టీ హైకమాండ్ అవినీతికి పాల్పడినప్పుడు, క్రింద దోచుకోవడానికి ఓపెన్ లైసెన్స్ ఉంటుంది. 10 ఏళ్ల క్రితం హర్యానాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రాష్ట్రాన్ని ఎలా దోచుకున్నారో అందరికీ తెలుసు అన్నారు. ఇక్కడ రైతుల భూములు దోచుకున్నారు, రాష్ట్రాన్ని దళారీలు, అల్లుడులకు అప్పగించారు. కాంగ్రెస్‌కు ఎక్కడ అవకాశం దొరికినా, ఎక్కడ అడుగు పెట్టినా అవినీతి, బంధుప్రీతి తప్పవని మీ అందరికీ తెలుసు. మన దేశంలోని ప్రభుత్వ వ్యవస్థలో అవినీతిని సృష్టించి, పెంచి పోషిస్తున్న పార్టీ కాంగ్రెస్ అని మోదీ ఆరోపించారు. రైతుల ప్రయోజనాల నిమిత్తం హర్యానాలోని బిజెపి ప్రభుత్వం రైతుల నుండి 24 పంటలను ఎంఎస్‌పికి కొనుగోలు చేయాలని నిర్ణయించిందన్నారు. కానీ ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు, తక్కువ ధరతో పంటలను కొనుగోలు చేయడాన్ని బీజేపీ అసహ్యించుకుందన్నారు. హర్యానాలో గత పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం ఉందని అన్నారు. కానీ మా ప్రభుత్వంపైనా, మన ముఖ్యమంత్రిపైనా ఎలాంటి అవినీతి ఆరోపణలు రాలేదన్నారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో హర్యానా నేడు వ్యవసాయం, పరిశ్రమల పరంగా దేశంలోని అగ్ర రాష్ట్రాలలో అగ్రస్థానంలో ఉందని ప్రధాని మోదీ అన్నారు. రిజర్వేషన్లపై కాంగ్రెస్‌పై దాడి చేసిన ప్రధాని మోదీ, కాంగ్రెస్ రాజకుటుంబం నుండి దేశానికి ప్రధానమంత్రిగా ఎవరు వచ్చినా రిజర్వేషన్లను ఎప్పుడూ వ్యతిరేకించారని అన్నారు. రిజర్వేషన్ వ్యతిరేకత, రిజర్వేషన్ ద్వేషం ఇవన్నీ కాంగ్రెస్ డీఎన్ ఏలోనే ఉఎస్సీ/ఎస్టీ/ఓబీసీల భాగస్వామ్యాన్ని కాంగ్రెస్ ఎప్పుడూన్నాయి. దూరం చేసిందన్నారు. దళితులకు రిజర్వేషన్లు కల్పించిన ఏకైక నాయకుడు బాబా సాహెబ్ అంబేద్కర్ అని, లేకుంటే ఓబీసీ మాదిరిగానే దళితులు కూడా రిజర్వేషన్ కోసం కాంగ్రెస్ ఓటమికి ఎదురుచూడాల్సి వచ్చేదన్నారు.

## మూసీ పరిధిలోని నిర్వాసితులు
## అనవసరమైన అపోహలకు లోను కావొద్దు..



**హైదరాబాద్, :** మూసీ నది సుందరీకరణలో భాగంగా మూసీ రివర్ బెడ్లోని ప్రవేటు వ్యక్తులకు సంబంధించిన దాదాపు 1600 నిర్మాణాలు సర్వే ద్వారా గుర్తించామని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ దానకిశోర్ తెలిపారు. ఈ నిర్మాణాలను తొలగించడానికి మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా ఒక కార్యాచరణను రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి ఒక్క నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేసి పునరావసం కల్పిస్తామన్నారు. దాదాపు 15 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లను మూసీ రివర్ బెడ్, బఫర్ జోన్ లో నివసిస్తున్న కుటుంబాల పునరావాసానికై రాష్ట్ర ప్రభుత్వం కేటాయింపులు చేసిందని తెలిపారు. అలాగే, రివర్ బెడ్లో ఉన్న నిర్మాణాలకు సంబంధించి పునరావాస కార్యాచరణకై సంబంధిత జిల్లా కలెక్టర్లకు మార్గదర్శకాలు రూపొందించుకోవాలని మూసీ రివర్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ దాన కిషోర్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే, డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించి పునరావసం కల్పించిన తర్వాతనే ఈ నిర్మాణాల తొలగింపు కార్యక్రమం ప్రారంభమవుతోంది అని దాన కిషోర్ ప్రకటించారు. బఫర్ జోన్కు సంబంధించి భూ సేకరణ, పునరావాస చట్టం ప్రకారం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.. ప్రభుత్వ అనుమతి తర్వాత చట్ట ప్రకారం నష్ట పరిహారం ఇచ్చిన తర్వాత మాత్రమే భూసేకరణ కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. మూసీ నది పరిధిలోని నిర్వాసితులు అనవసరమైన అపోహలకు లోను కావొద్దని.. అర్హులందరికీ పునరావాసం కల్పించడం జరుగుతుంది అని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ దానకిశోర్ వెల్లడించారు.

# ఇది స్వర్ణయుగం



ప్రతి రంగంలో కొన్ని చరిత్రాత్మక క్షణాలు ఉంటాయి. చదరంగంలో మన దేశానికిప్పుడు అలాంటి క్షణాలే. బుడాపెస్ట్‌లో ముగిసిన 45వ చెస్ ఒలింపియాడ్ భారతీయ చదరంగంలోనే కాదు... యావత్ భారత క్రీడారంగ చరిత్రలోనే చిరస్మరణీయం. మన ఆటగాళ్ళు తొలిసారిగా అటు ఓపెన్, ఇటు మహిళల కేటగిరీల్లో బంగారు పతకాలు సాధించి, దేశానికి మరువలేని కానుక ఇచ్చారు. చైనా, సోవియట్ రష్యా తర్వాత చెస్ ఒలింపియాడ్‌లో ఒకే ఏడాది ఇలా రెండు విభాగాల్లోనూ స్వర్ణాలు గెలిచిన మూడో దేశం మనదే. అలాగే, గుకేశ్, అర్జున్, దివ్య, వంతికల 4 వ్యక్తిగత స్వర్ణాలతో టోర్నీలో భారత్ తిరుగులేని ఆధిక్యాన్ని చాటింది. విశ్వనాథన్ ఆనందన్ బాటలో నడిచిన ఆయన శిష్యబృందం దేశాన్ని సమున్నతంగా నిలిపింది. కేవలం పదేళ్ళ క్రితం ఆశ్చర్యకరంగా కాంస్యం గెలిచి ఒలింపియాడ్‌లో బోణీ కొట్టిన దేశం, గడచిన 2022లో రెండు విభాగాల్లోనూ కాంస్యాలకే పరిమితమైన దేశం ఇవాళ ఈ స్థాయికి ఎదగడం అసామాన్యం. ఒక్కమాటలో నిన్న మొన్నటి దాకా చెస్‌లో సాగిన యూరోపియన్ ప్రపంచ ఆధిపత్యానికి తెరపడింది. ఆటకు భవిష్యత్ చిరునామాగా భారత్ ఆవిర్భవించింది. చదరంగంలో అక్షరాలా మన స్వర్ణయుగం ఆరంభమైంది. ఒలింపిక్స్ పోటీల్లో స్థానం లేని చెస్‌కు సంబంధించినంత వరకు ఈ చెస్ ఒలింపియాడే... ఒలింపిక్స్. అలాంటి అత్యున్నత స్థాయి పోటీల్లో... 193 దేశాలకు చెందిన అంతర్జాతీయ జట్లు పాల్గొన్న ఓపెన్ విభాగంలో, 181 దేశాలు పోటీపడ్డ మహిళా విభాగంలో మన జట్లు స్వర్ణాలు సాధించడం ఆషామాషీ వ్యవహారం కాదు. ప్రతి దేశం నుంచి అయిదుగురు అగ్రశ్రేణి క్రీడాకారుల జట్లు ఆ యా విభాగాల్లో పోటీ పడతాయి. అలాంటి చోట ఓపెన్ విభాగంలో తొమ్మిదో రౌండ్‌లో ఉజ్బెకిస్తాన్‌తో జరిగిన ఆటను డ్రా చేయడం తప్ప, మొత్తం 11 రౌండ్లకు గాను 10 రౌండ్లు మన భారత జట్టు గెలిచింది. టైటిల్ విజేతగా నిలిచింది. అంతేకాక 21 పాయింట్ల రికార్డ్ స్కోర్ సాధించి, రెండోస్థానంలో నిలిచిన 17 పాయింట్ల అమెరికా కన్నా చాలా పైన మనం నిలవడం విశేషం. మహిళా విభాగంలోనూ మొత్తం 11 రౌండ్లలో, ఒక్క 8వ రౌండ్‌లో పోలండ్‌తోనే మన జట్టు ఓడింది. అమెరికాతో ఆటను డ్రా చేసి, మొత్తం 19 పాయింట్లు సాధించి, స్వర్ణం సాధించింది. కనివిని ఎరుగని ఈ జంట విజయాల కారణంగానే ఇవాళ మన క్రీడా ప్రపంచం సంబరాలు చేసుకుంటోంది. మొత్తం మీద భారతీయుల ఆటగా పేరొందిన చదరంగంలో ఇప్పుడు మళ్ళీ పుట్టినింటికి పూర్వ వైభవం వచ్చింది. ఈ ఒలింపియాడ్ విజయాలు దేశవ్యాప్తంగా మన యువతరంలో దాగిన చదరంగ ప్రతిభాపాటవాలకు అద్దం పడుతున్నాయి. గుకేశ్ దొమ్మరాజు లాంటి మన ఆటగాళ్ళు కొందరు వ్యక్తిగత స్వర్ణాలు సైతం సాధించడం అందుకు నిదర్శనం. ఒకప్పుడు విశ్వనాథన్ ఆనంద్ లాంటి కొందరి పేర్లే వినిపించిన దేశంలో ఇటీవల దాదాపు 85 మంది గ్రాండ్ మాస్టర్లు ఉద్భవించారు. వారిలో పలువురు 20వ పడిలో వారే. అయిదుసార్లు ప్రపంచ చెస్ ఛాంపియన్నైన మ్యాగ్నస్ కార్ల్‌సెన్‌ను పలుమార్లు ఓడించిన ప్రజ్ఞానంద లాంటి టీనేజ్ వండర్లు మనకున్నారు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అగ్రశ్రేణిలో నిలిచిన అర్జున్ ఇరిగైసి, విదిత్ గుజరాతీ, హరికృష్ణ తదితరులు మన పురుషుల జట్టులో ఉన్నారు. అలాగే, అనుభవమున్న కోనేరు హంపి జట్టులో లేకున్నా, ఒకట్రెండు తడబాట్లు ఎదురైనా సరే పట్టువదలక పోరాడి, ఒలింపియాడ్ విజయం సాధించిన ఆడపిల్లల జట్టు ఈ రోజున మనకుంది. అంతకంతకూ పెరుగుతున్న మన బలానికీ, బలగానికీ అది గీటురాయి. పోగుబడ్డ ప్రతిభావంతులకు నిరంతర సాధన, నిరుపమానమైన టీమ్ స్పిరిట్ కూడా తోడై తాజా అందలాన్ని ఎక్కించాయి. అదే సమయంలో మన ప్రస్తుత విజయ పరంపరకు స్ఫూర్తి... ప్రజ్ఞానంద, గుకేశ్ లాంటి పలువురికి చేయూతనిచ్చిన దీప్తి... శిక్షణకు ఎంతో ఖర్చయ్యే ఈ ఆటలో వర్ధిష్ణువులెందరికో స్పాన్సర్‌షిప్‌లు దక్కేలా తోడ్పడ్డ తెర వెనుక దీప్తి... 15వ వరల్డ్ చెస్ ఛాంపియన్నైన విశ్వనాథన్ ఆనంద్ అని మర్చిపోలేం. ప్రతిభ గల పిల్లల్ని తీర్చిదిద్దడానికి వీలుగా ఒక వాతావరణాన్నీ, వ్యవస్థనూ కల్పించిన ఆలిండియా చెస్ ఫెడరేషన్ కృషినీ చెప్పుకొని తీరాలి. పెరిగిన సోషల్ మీడియా, హద్దులు లేని డిజిటల్ వ్యాప్తి సైతం మన యువతరాన్ని చెస్ వైపు ఆకర్షించిందీ నిజమే. భారతీయ స్ట్రీమింగ్ వేదికల్లో బాగా పాపులరైన చెస్‌బేస్ ఇండియాకు దాదాపు 19 లక్షల మంది సబ్‌స్క్రైబర్లున్నారు. ఆ వేదిక వివిధ టోర్నీల నిర్వహణతో పాటు క్రౌడ్ ఫండింగ్ ద్వారా పలువురు ఆటగాళ్ళకు ఆర్థికంగా అండగా నిలవడం చెప్పుకోదగ్గ విషయం. ఇప్పుడీ ఒలింపియాడ్ డబుల్ ధమాకా స్వర్ణాలు చెస్ ప్రాచుర్యంతో పాటు పిల్లల్లో ఆసక్తి పెంచడం ఖాయం. భారత చదరంగానికి ఇది శుభతరుణం. త్వరలో జరిగే వరల్డ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో ప్రస్తుత చైనీస్ ఛాంపియన్‌తో 18 ఏళ్ళ మన గుకేశ్ పోరు కోసం అంతా ఆసక్తిగా చూస్తున్నారు. ఇప్పటికే ఉన్నవారు కాక, కనీసం మరో అరడజను మంది ఒలింపియాడ్‌లో స్థానం కోసం పోటీపడుతున్న స్థాయికి చేరాం. అయితే, ఇది చాలదు. ఆడపిల్లల్లో మన చెస్ బలగం ఇంకా పెరగాల్సి ఉంది. ఇదే అదనుగా కేంద్రం, రాష్ట్రాలు మరింత ప్రోత్సాహం అందించాలి. పాఠశాలల స్థాయి నుంచే చెస్ పట్ల పిల్లల్లో ఆసక్తిని పెంచాలి. బడుల్లోనే కాక గ్రంథాలయాల్లో, స్థానిక పట్టణ కేంద్రాల్లోనూ చెస్‌కు వసతులు కల్పించాలి. అలాగే మన దేశంలోనూ అగ్రశ్రేణి టోర్నీలు జరిగేలా చూడాలి. చెన్నై ఇవాళ చదరంగ ప్రతిభకు కేంద్రంగా మారిందంటే తమిళనాడు ప్రభుత్వం ఇచ్చిన చేయూత కారణం. అందరికీ అది ఆదర్శప్రాయం. స్వర్ణయుగం సుదీర్ఘంగా కొనసాగాలంటే ఇలాంటి చర్యలే కీలకం.

# స్వర్గానికి కొంచెమే తక్కువ... ఎలా చేరుకోవాలో తెలుసా?

## కాంచన్‌జంగ

కాంచన్‌జంగ... మనదేశంలో ఎత్తైన శిఖరం. ప్రపంచ శిఖరాల జాబితాలో మూడవస్థానం. తొలిస్థానంలో ఎవరెస్టు ఉంటే రెండో స్థానంలో కేటూ ఉంది. కేటూ శిఖరం పాక్ ఆక్యుపైడ్ కశ్మీర్ పరిధిలో ఉండడంతో మనదేశంలో తొలి ఎత్తైన శిఖరం రికార్డు కాంచన్‌జంగకు వచ్చింది. ప్రపంచంలో అద్భుతంగా విస్తరించిన అరుదైన నేషనల్ పార్కుల్లో కూడా కాంచన్‌జంగ నేషనల్ పార్కుది ప్రత్యేకమైన స్థానం. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొంది విదేశీ ట్రెకర్‌లను ఆకర్షిస్తున్న కాంచన్‌జంగ నేషనల్‌పార్కు, పర్వత శిఖరాలను వరల్డ్ టూరిజమ్ డే (27, సెప్టెంబర్) సందర్భంగా మనమూ చుట్టి వద్దాం...

### స్వర్గానికి కొంచెమే తక్కువ

పక్షులు, జంతువులు, పర్వతసానువులు, మంచు శిఖరాలను సంతృప్తిగా వీక్షించాలంటే ట్రెకింగ్‌ను మించినది లేదు. కంచన్‌జంగ నేషనల్ పార్కు, పర్వత శిఖరాలకు ట్రెకింగ్ చేయాలనుకునేవాళ్లకు దారులు పెంచింది సిక్కిం రాష్ట్రం. ట్రెకింగ్‌లో త్వరగా గమ్యాన్ని చేరాలని హడావుడిగా నడిచే వాళ్లు తమ చుట్టూ ఉన్న సౌందర్యాన్ని ఆస్వాదించలేరు. ప్రశాంతంగా అడుగులు వేస్తూ సరస్సులు, హిమనీ నదాలు, రోడోడెంట్రాన్ పూల చెట్లు, ఓక్ చెట్లు, ఔషధవృక్షాలను మెదడులో ముద్రించుకోవాలి. ఎప్పుడు కంటికి కనిపిస్తాయో తెలియని కస్తూరి జింక, మేక జాతికి చెందిన హిమాలయ తార్, అడవి కుక్కలు, హిమాలయాల్లో మాత్రమే కనిపించే నీలం గొర్రెలు, మంచు చిరుత, ఎర్రటిపాండా, నల్ల ఎలుగుబంటి, టిబెట్ గాడిదల కోసం కళ్లను విప్పార్చి శోధించాలి. కాంచన్‌జంగ నేషనల్‌పార్క్ ట్రెకింగ్‌లో కాళ్ల కింద నేలను చూసుకోవడంతోపాటు అప్పుడప్పుడూ తలపైకెత్తి కూడా చూస్తుండాలి. తలదించుకుని ముందుకు?ోతే పక్షులను మిస్సవుతాం. పక్షిజాతులు 500కు పైగా ఉంటాయి. వాటిని గుర్తించడం కూడా కష్టమే. ఆకుపచ్చరంగులో మెరిసే రెక్కలతో ఏషియన్ ఎమరాల్డ్‌కూ వంటి అరుదైన పక్షులు కనువిందు చేస్తాయి. కాంచన్‌జంగ పర్వత శిఖరాన్ని చేరడానికి మౌంటనియరింగ్‌లో శిక్షణ ఉండాలి. ట్రెకింగ్ చేయడానికి సాధారణం కంటే ఒక మోస్తరు ఎక్కువ ఫిట్‌నెస్ ఉంటే చాలు.



### నదం నదవుతుంది!

కశ్మీర్‌లో చలికి గడ్డకట్టిన దాల్ లేక్‌ను చూస్తాం. కంచన్‌జంగ టూర్‌లో జెమూ గ్లేసియర్‌ను తప్పకుండా చూడాలి. ఈ హిమానీనదం దాదాపుపాతిక కిలోమీటర్లకు పైగా ఉంటుంది. మంచులా బిగుసుకుపోయిన నీరు రాతికంటే గట్టిగా తగులుతుంది. ఎండాకాలంలో కరిగి నీరయి ప్రవహిస్తూ అనేక ఇతర నదులకు చేరుతుంది. తీస్తా నదికి కూడా ఈ గ్లేసియరే ఆధారం.

### శిఖరాలను చూడవచ్చు!

హిమాలయాలను ఏరియల్ వ్యూలో చూడడానికి విమాన ప్రయాణంలోనే సాధ్యం. కంచన్ జంగ నేషనల్ పార్కుకు చేరాలంటే సిలిగురి, బాగ్‌డోగ్రా ఎయిర్?ోర్టు నుంచి 220కిమీల దూరం ప్రయాణించాలి. ఈ దూరం రోడ్డు మార్గాన వెళ్ల వచ్చు లేదా హెలికాప్టర్‌లో 20 నిమిషాల ప్రయాణం. రైలు ప్రయాణాన్ని ఇష్టపడే వాళ్లు జల్‌పాయ్‌గురిలో దిగాలి. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో వెళ్లాలి. పరిసరాలను, ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించడానికి రైలు, రోడ్డు ప్రయాణాలు బెస్ట్. ఒకవైపు ఫ్లయిట్ జర్నీ, మరో వైపు ట్రైన్ జర్నీప్లాన్ చేసుకుంటే టూర్ పరిపూర్ణమవుతుంది. ఇక్కడ పర్యటించడానికి ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు అనుకూలం. మనదేశంలో సింగిల్ యూజ్ ప్లాలాస్టిక్‌ని నిషేధించిన తొలి రాష్ట్రం సిక్కిం. పర్యాటకులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. మనుషులను, లగేజ్‌ని సోదా చేసి ప్లాస్టిక్ వస్తువులను బయటవేస్తారు.

# ధరణి లోపాల ఊసెత్తకుండా కొత్త చట్టమా!?




తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకునే ప్రయత్నంలో భాగంగా రైతులు పడుతున్న కష్టాలను గట్టెక్కించడానికి ధరణి పోర్టల్ స్థానంలో కొత్త ఆర్ఓఆర్ చట్టం-2024ను తీసుకొని వస్తానంటుంది. ధరణిగా పిలవబడే పోర్టల్ 2020 అసెంబ్లీలో చర్చ చేయబడని చట్టం, అది ఒక చట్టం కాని చట్టం. ఈరోజు వరకు కూడా దానివల్ల ప్రజలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏ రకమైన స్పందన లేని గత ప్రభుత్వం చివరికి అధికారం కూడా కోల్పోవలసి వచ్చింది. ఈ పోర్టల్‌ను బంగాళాఖాతంలో వేస్తామంటూ ప్రచారం చేసి ప్రజలకు హామీనిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే ఇప్పుడు అందులోని లోటుపాట్లను సవరించకుండా కొత్త ఆర్ఓఆర్ 2024 చట్టం తెస్తానంటున్నది. ధరణి పోర్టల్ 2020 - కొత్త ఆర్.ఓ.ఆర్ చట్టం 2024... ఈ రెండింటిని కూడా నల్సార్ యూనివర్సిటీ వారు తయారు చేశారు. కొత్త చట్టం ముసాయిదా కూడా తయారు చేశారు. ఈ రెండు చట్టాల్లో కూడా 1971లో వచ్చిన ఆర్ఓఆర్ చట్టానికి భిన్నమైన సూచనలు ఏమీ లేవు. ఈ చట్టం ఆధారంగానే 1989లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో సీనియర్ ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో రూల్స్ రూపొంది, అవి అమలు జరుగుతూ వస్తున్నాయి. అప్పటి నుండి 2019 వరకు కూడా సజావుగా జరిగాయి. ప్రజలకు కొన్ని అసౌకర్యాలు ఉన్నప్పటికీ ఆ వ్యవస్థ బాగానే ఉండింది. ధరణిలో ఉన్న లోపాలను సరి చేయకుండా కొత్త వ్యవస్థ ప్రతిపాదనలు ఎంతవరకు సబబు. 1971 చట్టాన్ని అనుసరించి కొన్ని మార్పులు చేర్పులు చేసి సంస్థాగతమైన నిర్ణయాలు తీసుకుని చట్టం చేసి ఉంటే కొంత మేలు జరిగేది. నిజానికి ఈ రెండు కొత్త చట్టాలకు 1971 చట్టం మూలమైన ఆధారం. ఈ మూడింటిని క్రోడీకరించి ప్రస్తుత పోర్టల్‌లో కరెక్షన్ చేసి ఉంటే సరిపోయేది. అంతేగాని కొత్త చట్టం తీసుకురావడం, రూల్స్ తయారు చేయడం కాలయాపనే అవుతుంది. కొత్త చట్టం ముసాయిదా రెడీ అయ్యింది. తెలంగాణ ప్రభుత్వం దీన్ని చర్చ కోసం, ప్రజాభిప్రాయం కోసం ప్రజలు ముందుకు తీసుకొచ్చింది. ఈ బిల్లు కాపీలను అన్ని ప్రతిపక్షాలకు, అన్ని రాజకీయ పార్టీలకు, రైతు సంఘాలకు, రిటైర్డ్ కలెక్టర్లకు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగ సంఘాలకు ఇచ్చారు. బిల్లు కాపీలను ప్రజాక్షేత్రంలో పెడుతూ అందరి సలహాలు సూచనలు కోరారు. అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో కూడా సమావేశాలు నిర్వహించి రైతులు, రాజకీయ నాయకులు జిల్లాల వారీగా ఉన్న ముఖ్య నాయకుల సమక్షంలో సమావేశాలు నిర్వహించారు. ప్రజల నుండి వస్తున్న సూచనలను, సలహాలను పరిగణనలోకి తీసుకొని ముందుకెళ్లాలని ప్రభుత్వం సూచించింది. ఇక్కడ అనుభవజ్ఞులైన రెవెన్యూ సిబ్బంది, కొన్ని రైతు సంఘాలు చేసిన సూచన ప్రకారం 1971లో వచ్చిన ఆర్ఓఆర్ చట్టం ఒక శాస్త్రీయ దృక్పథంతో చేయబడింది. ప్రస్తుత ధరణిలో ఉన్న మార్పులు చేర్పులు చేసి యథాతథంగా కొనసాగిస్తే సరిపోతుంది. అనుభవదారు లేదా కాస్తు కాలమ్‌లో సాగు రైతు పేరు ఉండాలని సూచనలు వచ్చాయి. యాభై సంవత్సరాలుగా కౌలు చేసుకుంటున్న భూములను ప్రభుత్వం కొనుగోలు చేసి ఇచ్చి ఉంటే రైతులకు మేలు జరిగేది. గత ప్రభుత్వం దళితులకు మూడు ఎకరాల వాగ్దానం నెరవేరేది. భూమిని కొని ఇవ్వకపోగా కౌలు చేసుకుంటున్న భూములకు, కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి అందవలసిన సహాయం అందకుండా పోయింది. ప్రస్తుతం చేస్తున్న మార్పులు చేర్పులలో వారికి కొన్ని రక్షణలు కల్పించాలి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం 2020లో కౌలు రైతుల హక్కులను గుర్తించకుండా అనుభవదారుని గడిని తొలగించారు. దీనివలన వందలు వేల ఎకరాల పట్టాదారులు లేదా భూస్వాములు వాటిని అమ్ముకోవడం కొనుగోలు చేయడం సులభతరం అయ్యింది. కేసీఆర్ లక్ష్యం నెరవేరింది. ఈ వాస్తవాలు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆలస్యంగా అర్థం అయ్యాయి. ఇప్పుడు కొత్త చట్టం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వ ముందుకు వస్తోంది. కానీ మెజారిటీగా ఉన్న బడుగు బలహీనుల, చిన్న సన్నకారు రైతుల, ప్రజా ప్రయోజనాలకు వాస్తవ రూపాన్ని ఇచ్చేలా కొత్త చట్టం ఉండాలి. రైతులు చేస్తున్న ప్రధాన సూచనలలో భాగంగా తహసీల్దారు నుంచి తొలగించబడిన అధికారాలను పునరుద్ధరించాలి. ఎనభై శాతం పనులు తహసీల్దారు కార్యాలయంలోనే జరగాలి. పాలన వికేంద్రీకరించబడాలి. పరిపాలన సజావుగా జరగాలంటే యాభై మూడు రకాల విధులు నిర్వహించవలసిన రెవెన్యూ శాఖ, పాలకుల ఇష్టానుసారం కాకుండా అవసరమైన క్షేత్రస్థాయి మానవ వనరులు వీఆర్ఏ, వీఆర్వోలను, ప్రతి మండలానికి ఒక సర్వేయర్ లేదా లైసెన్స్ సర్వేయర్, పాత తహసీల్దారు కార్యాలయానికి ఒక స్టాటిస్టికల్ అధికారిని నియమించేలా చట్టం చేయాలి. తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని కొలిచి కమతాల వారీగా ఒక యూనిక్ నంబర్ ఇవ్వాలి. జాయింట్ రిజిస్టర్ వద్ద జరిగే వ్యవసాయ భూముల మ్యుటేషన్, సక్సెషన్ ప్రొసీడింగ్స్ ఇచ్చే ముందు పదిహేను రోజుల వ్యవధి ఉండాలి. అభ్యంతరాలు ఏవైనా ఉంటే బయటికి వస్తాయి. తహసీల్దారు ఇచ్చిన ఉత్తర్వులలో ఏవైనా లోపాలు ఉంటే ఆర్డీఓకి అప్పీలు చేసుకునేలా ఉండాలి. ఇక్కడ న్యాయం జరగకపోతే జాయింట్ కలెక్టర్, చివరగా ల్యాండ్ రెవెన్యూ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి అన్ని స్థాయిల్లో తొంభై రోజులలో పరిష్కరించేలా చట్టం చేయాలి. ప్రస్తుతం ఉన్న ధరణి పోర్టల్ పుస్తకం లాంటిది, భూదార్ కార్డు దానికి ఇవ్వాలని అనుకుంటే ముందు భూదార్, టెంపరరీ భూదార్, భూదార్ కార్డు ఇందుకు ఒక సంపూర్ణమైన నిర్వచనం ఉండేలా చూడాలి. ఇది సమగ్ర సర్వే చేయకుండా ఏ కార్డు ఇచ్చినా ఈ ప్రయోగం నిరర్థకమే. అన్ని భూములను ఒకసారి సర్వే చేయాలి. ఆ పని చేయకుండా ఏ నిర్ణయమైనా సరైన ఫలితాలను ఇవ్వదు. ధరణి స్థానంలో భూమాత అనే పేరు ఉండటం ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఈ చట్టంలో ఏజెన్సీ ప్రాంతాల్లోని భూమి బాధిత ఆదివాసీల ప్రస్తావన తీసుకురావాలి. 1/70 చట్టం సరిగ్గా అమలు అయ్యేలా రూపకల్పన చేయాలి. ప్రతి ఏటా పాత పద్ధతిలోనే జమాబందీ చేయాలి. రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమి లెక్క తేలుతుంది. ప్రతి ఏటా భూమాత రికార్డును ఒక ప్రింట్ తీసి అన్ని అమెండ్మెంట్లతో ఫస్లీ ఇయర్‌లో తయారు చేయాలి. మ్యుటేషన్, సక్సెషన్ సమయంలో చట్టబద్ధంగా నియమించబడిన కంప్యూటర్ టెక్నీషియన్, బాధ్యతాయుతమైన సర్వీస్ ప్రొవైడర్ (ఎన్ఐసి), మీసేవ లాంటి ప్రైవేట్ సంస్థలపై కూడా నిఘా ఉండేలా చట్టం చేయాలి. అరవై శాతం గ్రామీణ ప్రజల జీవనాధారం వ్యవసాయం. రైతులు, రైతు కూలీల, రైతు అనుబంధ వృత్తుల వారి దృష్టి కోణంలో పై సలహాలను క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకమైన సులభతరమైన భాషలో ఒక ప్రగతిశీలమైన కొత్త భూమి హక్కుల రికార్డు చట్టం 2024 తీసుకురావాలి.

## రేవంత్ అనాడు మాట్లాడిన ఒక్క మాట కూడా అమలు చేయలేదు




**హైదరాబాద్, :** తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు జరిగాయి. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించిన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్పంచులు, గ్రామ పంచాయతీలను కేసీఆర్ ప్రభుత్వం విస్మరిస్తుందని రేవంత్ రెడ్డీ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మాట్లాడారు.. బిల్లులు రాక 60 మంది సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారని అప్పుడు రేవంత్ అన్నారు.. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రేవంత్ అనాడు మాట్లాడిన ఒక్క మాట కూడా అమలు చేయలేదు అని ఆయన మండిపడ్డారు. సర్పంచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు ఆయనని పలకరించిన నాథుడే లేడు.. అడ్డదారులు తొక్కి అధికారంలోకి రేవంత్ రెడ్డి వచ్చారు.. సర్పంచుల పెండింగ్ బిల్స్ వెంటనే చెల్లించాలి అని డిమాండ్ చేశారు. దసరాలోపు పెండింగ్ బిల్స్ క్లియర్ చేయాలని ఈటల రాజేందర్ అన్నారు. లేకుంటే మిమ్మల్ని ఎక్కడికి అక్కడ అడ్డుకునేందుకు సర్పంచులు సిద్దంగా ఉన్నారని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ తెలిపారు. సర్పంచుల ఆందోళనకు బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తాం.. సర్పంచ్ ల పదవి కాలం పూర్తయ్యి ఏడు నెలలు దాటినా ఎన్నికలు ఎందుకు పెట్టడం లేదు అని ప్రశ్నించారు. పాలక మండలి లేక గ్రామాల్లో చెత్త పేరుకుపోతుంది.. రేవంత్ గ్రామాలను వల్లకాడుగా మార్చారు.. వెంటనే రిజర్వేషన్లు ప్రకటించి సర్పంచు ఎన్నికలు జరపాలి అని కోరారు.

## కడప వైసీపీలో కలవరం..! కూటమి వైపు కార్పొరేటర్ల క్యూ..




**అమరావతి,:** వైసీపీ కంచుకోటలో పాగా వేసేందుకు కూటమి నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారట. అసంతృప్తిగా ఉన్న వైసీపీ కార్పొరేటర్లను కూటమిలోకి రావడానికి ద్వారాలు తెరిచారట. అయితే, కడప కార్పొరేషన్.. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్ గా అప్‌గ్రేడ్ అయినప్పటికీ నుంచి నేటి వరకు వైఎస్ కుటుంబానికి కంచుకోటగా ఉంది. 2006లో కార్పొరేషన్ గా అప్ గ్రేడ్ అయింది. దీనికోసం కడప పట్టణానికి సమీపంలో ఉన్న పలు గ్రామాలను మెర్జ్ చేశారు. దీంతో కమలాపురం నియోజకవర్గంలోని పలు గ్రామాలు.. కడప కార్పొరేషన్ లో విలీనం అయ్యాయి. ఆనాటి నుండి కడప ఎమ్మెల్యే తో పాటు కమలాపురం ఎమ్మెల్యేకి సంబంధించిన నేతలు కార్పొరేటర్లుగా గెలుపొందుతూ వస్తున్నారు. ప్రధానంగా కడప అసెంబ్లీ మొత్తం కార్పొరేషన్ పరిధిలోనే ఉంటుంది. కడప ఎమ్మెల్యే ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్న కార్పొరేషన్ రెజల్యూషన్ తప్పనిసరి. 2004 నుంచి ఇప్పటివరకు కడప అసెంబ్లీలో టీడీపీ అభ్యర్థులు గెలిచిన దాఖలాలు లేవు. 20 సంవత్సరాలు తర్వాత మొదటిసారిగా కడప, కమలాపురం రెండు నియోజకవర్గాలలో టీడీపీ అభ్యర్థులు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అంతేకాకుండా రాష్ట్రంలో కూడా టీడీపీ అధికారం చేపట్టడంతో ఆ ఇద్దరు ఎమ్మెల్యేల దృష్టి కడప కార్పొరేషన్ పై పడిందట. గత 20 సంవత్సరాలుగా వైసీపీ కంచుకోటగా ఉన్న కడప కార్పొరేషన్ పై తమ ఆధిపత్యం చెలాయించడం కోసం వైసీపీ కార్పొరేటర్లు కూటమిలోకి రావడానికి ఆ ఇద్దరు నేతలు ద్వారా తెరిచారట. కడప కార్పొరేషన్ లో 50 డివిజన్లు ఉన్నాయి. వాటిలో ఒక్క డివిజన్‌లో మాత్రమే టీడీపీ కార్పొరేటర్.. మిగతా 49 డివిజన్లలో వైసీపీ కార్పొరేటర్లు గెలుపొందారు. కరోనాకాలంలో ఒక్క కార్పొరేటర్ మృతి చెందారు. మేయర్ తో సహా 48 మంది కార్పొరేటర్లు వైసీపీకి చెందిన వారే. కడప ఎమ్మెల్యేగా మాధవి గెలిచిన అనంతరం రెండుసార్లు కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. తన మార్కు సాధించడం కోసం ఆమె కార్పొరేటర్ లను టీడీపీలోకి రావడం కోసం పావులు కదుపుతోందట%ొ% వైసీపీలో అసంతృప్తిగా ఉన్న కార్పొరేటర్ లను తమ వైపు తిప్పుకోవడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారట.. అందులో భాగంగా 25వ డివిజన్ కార్పొరేటర్ సూర్యనారాయణ.. వైసీపీని వీడి టీడీపీలో చేరారట. మరికొంతమంది వైసీపీ కార్పొరేటర్లు కూటమిలో చేరుతున్నారంటూ ముమ్మరంగా ప్రచారం సాగుతోంది. కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి కూడా తన నియోజకవర్గం లోని ఐదు మంది కార్పొరేటర్లతో మంతనాలు జరుపుతున్నారట.. వీరు కూడా త్వరలో టీడీపీ తీర్థం పుచ్చుకుంటారని జిల్లాలో జోరుగా ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా మరో 6 మంది కార్పొరేటర్లు బీజేపీ నేతలతో టచ్ లో ఉన్నారట. టీడీపీలోకి వారికి అనుమతి లేకపోవడంతో.. బీజేపీ పంచన చేరడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారట. బీజేపీ పెద్దలు కూడా కడప అసెంబ్లీలో పార్టీని బలోపేతం చేయడానికి కార్పొరేటర్ల చేరికకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. మరి కొంతమంది కార్పొరేటర్లు జనసేన నేతలతో మంతనాలు జరుపుతున్నారట. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో తాము కూటమిలో చేరితే పనులు చక్కబెట్టుకోవచ్చని వైసీపీ కార్పొరేటర్లు భావిస్తున్నారట. గత 20 సంవత్సరాలుగా వైసీపీలో ఉన్న కార్పొరేటర్లు నేడు పార్టీని వీడుతున్నవారిని అడ్డుకోవడంలో వైసీపీ అధిష్టానం విఫలమైందనే విమర్శలు ఉన్నాయి.. ఏది ఏమైనా కడప కార్పొరేషన్ పై పట్టు సాధించడం కోసం ఇద్దరు ఎమ్మెల్యేలు ముమ్మురంగా ప్రయత్నం చేస్తున్నారనడంలో ఎటువంటి సందేహం లేదు

## ఈ ఎన్నికల్లో ప్రజలు వారికి బుద్ధి చెబుతారు



ఇంటర్నెట్ డెస్క్: సాగు చట్టాలపై భాజపా ఎంపీ, నటి కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. దీనిపై సొంత పార్టీ నుంచి కూడా వ్యతిరేకత రావడంతో ఆమె క్షమాపణలు చెప్పారు. ఈ పరిణామాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే స్పందించారు. భాజపా రైతు వ్యతిరేక విధానాలు మరోసారి బయటపడ్డాయని దుయ్యబట్టారు. ''750 మంది రైతులు బలైన తర్వాత కూడా.. ఈ రైతు వ్యతిరేక భాజపా పార్టీ, మోదీ ప్రభుత్వం తమ ఘోర తప్పిదాన్ని ఇప్పటికీ గుర్తించట్లేదు. మూడు రైతు వ్యతిరేక సాగు చట్టాల అమలు చేయడంపై ఇంకా చర్చిస్తోంది. నిరసన సమయంలో అన్నదాతలపై మోదీ ప్రభుత్వం చేసిన అరాచకాలను 62 కోట్ల మంది రైతులు ఇంకా మరచిపోలేదు. రైతులపై అవమానకర వ్యాఖ్యలకు ఈసారి హరియాణా సహా ఎన్నికలు నిర్వహించే రాష్ట్రాల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారు'' అని మల్లికార్జున ఖర్గే జోస్యం చెప్పారు. మోదీ చేసిన ప్రకటనల కారణంగా ఆయన మంత్రులు, ఎంపీలకు రైతులను అవమానించడం అలవాటుగా మారిందని ఆరోపించారు. అన్నదాతలకు ఇచ్చిన మూడు వాగ్దానాలను మోదీ ప్రభుత్వం ఉల్లంఘించిందని మండిపడ్డారు. రైతుల ఉపశమనం కల్పించడం మాని.. వారిని అవమానిస్తూనే ఉన్నారని ధ్వజమెత్తారు. ఆ పార్టీలో రైతుల పట్ల ఎంత వ్యతిరేకత ఉందో ఇప్పుడు యావత్ దేశానికి మరోసారి అర్థమైందన్నారు. 'రద్దు చేసిన మూడు సాగు చట్టాలను మళ్లీ అమల్లోకి తీసుకురావాలని, రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా ఉండే ఆ చట్టాలను మళ్లీ అమలు చేయాలని, ఆ చట్టాల కోసం రైతులే డిమాండ్ చేయాలి' అని కంగనా మంగళవారం చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై విమర్శలు రావడంతో పార్టీకి ఎలాంటి సంబంధం లేదని భాజపా వెల్లడించింది. ఈ క్రమంలోనే కంగన క్షమాపణలు చెబుతూ వీడియో పోస్ట్ చేశారు.

## వైఎస్ జగన్‌ను కలిసిన కొడాలి నాని, వల్లభనేని వంశీ



**అమరావతి,:** వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిని పలువురు కీలక నేతలు కలిశారు. వైఎస్ జగన్ ను కలిసిన నేతలలో కొడాలి నాని, వల్లభనేని వంశీ తదితరులు ఉన్నారు. వైఎస్సార్సీపీలో సంస్థాగత మార్పులు జరుగుతూ ఉండడంతో, రాజకీయ పరిణామాలను చర్చించడంతో పాటు జిల్లాల అధ్యక్షుల ఎంపిక కోసం పార్టీ నేత వైఎస్ జగన్ వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నేతలతో తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో జగన్ భేటీ అయ్యారు. ఆయా జిల్లాల కొత్త అధ్యక్షుల పేర్లను ప్రకటించే అవకాశం ఉంది. నాని, వంశీలతో పాటు జగన్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రి పేర్ని నాని, ఉప్పాల రాము, హారిక తదితరులు ఉన్నారు.

# అడవి ఆర్తనాదం




పచ్చని పైరుని తలపించే స్వచ్ఛమైన వికారాబాద్ అడవి ఆపదలో పడింది. ఆదుకోమంటూ ఆర్తనాదం చేస్తోంది. మూడు వేల ఎకరాల దామగుండం రిజర్వు ఫారెస్టులో 900 ఎకరాల భూమిని కేంద్ర నేవీ నిర్మించే రాడార్ కేంద్రం కోసం గత ప్రభుత్వాలు కేటాయించాయి. దీని కోసం 12 లక్షల పచ్చని చెట్లను నరికేసేందుకు నేవీ వారు సిద్ధమయ్యారు. సహజసిద్ధ అడవిని నరికేసి పర్యావరణాన్ని సర్వనాశనం చేసేందుకు పక్కా ప్రణాళిక రూపొందించారు. అభివృద్ధి పేరిట వినాశనం మొదలుపెట్టారు. అడవిలోకి నరమానవులెవరూ ప్రవేశించకుండా కంచెల నిర్మాణమూ ప్రారంభించారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అడవిని హైదరాబాద్ మహానగరానికి స్వచ్ఛమైన ప్రాణ వాయువు అందించే నేచురల్ ఆక్సిజన్ సిలిండర్గా చెప్పుకుం టాం. అటువంటి అడవిని ధ్వంసం చేసేం దుకు ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. అక్కడ నేవీ అధికారులు, సిబ్బంది ఉండేందుకు టౌన్ షిప్ కట్టబోతున్నారు. పచ్చని అడవి స్థానంలో 2027 నాటికి స్కూళ్లు, హాస్పిటల్స్, మార్కెట్, బ్యాంకు, పెద్ద రోడ్లు పూర్తవ్వాలని లక్ష్యంగా పెట్టుకు న్నారు. అయితే ఇక్కడ నరికేయబోయే చెట్లకు బదులుగా దేశంలో ఏదో ఒక చోట ఇంకో 12 లక్షల చెట్లు నాటుతామని నేవీ అధికారులు పబ్లిక్ నోటీసు ఇచ్చారు. ఎన్ని చెట్లు నాటినా ఇంత పెద్ద సహజ మైన, ఔషధ మొక్కల అడవిని తిరిగి నిర్మించగలరా అనేది ఓ శేష ప్రశ్న. ఇప్పటికే అడవుల నరికివేతకు అధికారికంగా పర్మిషన్ ఇచ్చిన రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలో మొదటి స్థానంలో ఉంది. 2014 అంటే, రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి కేవలం ఐదేండ్లలో తెలంగాణలో అధికారికంగా 12,12,753 చెట్ల నరికివేతకు అనుమతి ఇచ్చినట్లు 2020లో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, తెలంగాణ (పీసీసీఎఫ్) స్వయంగా హైకోర్టుకు చెప్పింది. ఇప్పుడు ఒకే అడవిలో 12 లక్షల చెట్లతో పాటు, 150 ఎకరాల్లో లక్షలాదిగా ఉన్న ఔషధ మొక్కల్ని సైతం సర్వనాశనం చేయబోతున్నారు. భవిష్యత్లో రాడర్ నుండి వెలువడే రేడియేషన్లతో పక్షులు, వన్యప్రాణులు కనుమరుగయ్యే ప్రమాదమూ ఉంది. అన్నింటికీమించి ఈ రాడార్ కేంద్రం మూసీ నదికి మరణశాసనం కాబోతోంది. దీనిపై పర్యావరణవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వీరి ఆందోళనలో నిజముంది. ఎందుకంటే మూసీ పుట్టింది ఈ వికారాబాద్ అడవుల్లోనే. నది పుట్టిన చోట ఇటువంటి ప్రాజెక్ట్ నిర్మిస్తే భవిష్యత్తులో మూసీ ఎండిపోయే ప్రమాదం ఉంది. ఒకపక్క మూసీ ప్రక్షాళన చేస్తామంటున్నారు. మరోపక్క సహజ సందపను నాశనం చేస్తూ మూసీని కనుమరుగు చేయబోతున్నారు. ఇలాంటి వినాశనకర చర్యల వల్ల హైదరాబాద్ పకృతి వైపరీత్యాల నుంచి ఎలా తప్పించుకోగలదు? వాస్తవానికి రివర్ కేచ్ మెంట్ ఏరియాలో ఇలాంటి డెవలప్మెంట్ ప్రాజెక్టులు చేపట్టడం హైడ్రా చట్టానికి కూడా విరుద్ధం. అలాంటిది ఇంతటి విధ్వంసానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవడం అత్యంత విషాదం. అలాగే తెలంగాణలో ఉన్న అతిపెద్ద నేచురల్ ఫారెస్ట్ ఈ దామగుండం అడవులు. నల్లమలలో కూడా ఐదు శాతం మాత్రమే న్యాచురల్ ఫారెస్ట్ ఉంది. హైదరాబాద్కు 80 కిలోమీటర్ల దూరంలో ఇంత అద్భుతమైన నేచురల్ ఫారెస్ట్ ఉండటం రాజధాని నగరానికి అతిపెద్ద సంపద. అంతే కాదు ఈ అడవి చుట్టూ ఉన్న 20 గ్రామాల్లో ఉన్న 60 వేల మందికి ఈ అడవే అమ్మతల్లి. రైతులు తమ పశువులు మేపుకోవడానికి ఈ అడవే ఆధారం. పచ్చటి పొలాలన్నీ రియల్ ఎస్టేట్లా మారిపోతున్న నేటి పరిస్థితుల్లో ఈ అడవే వాళ్లకు నెలవు. అటువంటి అడవిని నరికి వారి పొట్టకొట్టబోతున్నారు. రాడార్ కేంద్రం కోసం ఈపాటికే అడవి చుట్టూ భారీ ప్రహరీ కట్టడం మొదలుపెట్టారు. దీంతో స్థానికులెవరినీ ఇక అడవిలోకి పోనివ్వరు. అలాగే ఇదే అడవిలో 500 ఏండ్ల చరిత్ర ఉన్న పురాతన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు ఏడాది మొత్తం నీటి ఊటలూరే సహజమైన గుండం కూడా ఉంది. ఇవన్నీ అడవితో పాటే కనుమరుగుకానున్నాయనే భావనే గుండెలను పిండేస్తున్నది. ఇప్పటికే పెరిగిపోతున్న కాలుష్యం వల్ల నగర ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. ఇక జనావాసానికి సమీపంలో రాడార్ కేంద్రం నిర్మిస్తే అనతి కాలంలోనే స్థానిక జనజీవనం అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉంది. ఇది వదిలే రేడియేషన్స్ వల్ల హైదరాబాద్లో మన తర్వాతి తరానికి స్వచ్ఛమైన గాలి అందకుండా పోతుంది. ప్రకృతి విపత్తులకు హైదరాబాద్ కేంద్రంగా మారే అవకాశమూ ఉంది. ప్రజలపై మరిన్ని రోగాలు దాడి చేసే ప్రమాదమూ ఉంది. ఢిల్లీలోవలె మన హైదరాబాద్లో కూడా మాస్క్ లేకుండా బయటకి రాలేని స్థితి వచ్చినా ఆశ్చర్యపోవల్సింది లేదు. ఇంతటి విధ్వంసాన్ని సృష్టించబోయే ఈ అభివృద్ధి అవసరమా? జరగబోయే ఈ వినాశనానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. రాడార్ కేంద్ర నిర్మాణంపై పునరాలోచించాలి. పర్యావరణానికి, ప్రజలకు హానిలేని ప్రదేశాన్ని దీని కోసం కేటాయించాలి. లేదంటే ఈ మహా విధ్వంసాన్ని ఆపేందుకు ప్రజలు మరో చిప్కో ఉద్యమానికి సన్నద్ధమవ్వడం ఖాయం.

# బుస కొడుతున్న కులవివక్ష!




'కసిరి బుసకొట్టు నాతని గాలిసోక.. నాల్గు పడగల హైందవ నాగరాజు' అంటూ సమాజంలో ఉన్న కుల దురహంకారాన్ని అనేక దశాబ్దాల క్రితమే నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా ఈసడించాడు. నాటి బుసలు.. నేడు కాలకూట విషంగా మారి. ప్రాణాలు తీసే స్థాయికి పెచ్చుమీరడం సిగ్గుచేటు. మన రాష్ట్రంలో ఇలాంటి దాడులు తరచూ చోటుచేసుకుంటుండగా, బిజెపి పాలిత రాష్ట్రాలు దేశంలోనే దళితులపై దాష్టీకాల్లో ముందువరసలో ఉన్నాయి. సమీప బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తూ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరులో ఓ ఇంటి అరుగుపై ఓ దళిత వ్యక్తి సొమ్మసిల్లి పడిపోయాడు. మనిషిని మనిషిగా చూడలేని పెత్తందారీ కులానికి చెందిన ఆ ఇంటి యజమాని బాధితుడిని కర్రతో కొట్టడంతోపాటు మరిగే నూనె పోసేశాడు. మనం ఏ సమాజంలో ఉన్నాం అంటూ భయపడేలా చోటుచేసుకుంటున్న ఇలాంటి మరిన్ని ఘటనలూ మన రాష్ట్రంలో చోటుచేసుకున్నాయి. దళిత యువకుడు, బిసి యువతి ప్రేమించుకుని ఆరు నెలల క్రితం పెళ్లి చేసుకున్నారు. ఇటీవల ఆ యువకుడి తల్లి తన స్వగ్రామానికి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ పెత్తందారులు యువతి కుటుంబ సభ్యులను రెచ్చగొట్టారు. యువకుడి తల్లిపై దాడి చేయకపోతే గ్రామ బహిష్కారం చేస్తామని హెచ్చరించారు. పెత్తందారులు, యువతి కుటుంబ సభ్యులు కలిసి యువకుడి తల్లిని చెట్టుకు కట్టేసి పాశవికంగా కొట్టారు. కర్నూలు జిల్లా పెద్దకడబూరు మండలం కల్లుకూటలో ఈ అఘాయిత్యం జరిగింది. అగ్రవర్ణ బాలికను ప్రేమించాడని కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవంలో దళిత బాలుడిని స్తంభానికి కట్టేసి కొట్టారు. ఇక అదే జిల్లాలో జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ రంగరాయ కళాశాలకు చెందిన దళిత ప్రొఫెసర్‌పై దాడి చేశారు. బీహార్‌లోని నవాడా జిల్లాలో దళితులు నివాసముంటున్న 21 ఇళ్లకు ఇటీవల నిప్పు పెట్టారు. ఉత్తర ప్రదేశ్‌లో ఇలాంటి నేరాలకు అంతేలేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పార్కు అభివృద్ధి పేరిట రాంపూర్ జిల్లా సిలారు బరగామ్‌లో లాఠీఛార్జి, కాల్పులు జరిపి పదో తరగతి చదువుతున్న దళిత విద్యార్థిని పొట్టనపెట్టుకుంది. కేంద్ర, సామాజిక న్యాయం, సాధికార శాఖ 2022కు సంబంధించి ఇటీవల విడుదల చేసిన నివేదిక మరిన్ని వాస్తవాలను కళ్లకు కట్టింది. ఆ ఏడాది దళితులపై దాష్టీకాలకు సంబంధించి 51,656 కేసులు దేశవ్యాప్తంగా నమోదయ్యాయి. బిజెపి పాలనలోని ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. 12,287 కేసులతో.. 23.78 శాతం నేరాలతో యోగి పాలనలోని ఉత్తరప్రదేశ్ మొదటి స్థానాన్ని వెలగబెట్టింది. 8,661 కేసులు, 16.75 శాతం నేరాలతో రాజస్థాన్, 7,732 కేసులతో 14.97 శాతం నేరాలతో మధ్యప్రదేశ్ ఆ తరువాతి స్థానాల్లో ఉన్నాయి. ఆ తరువాత స్థానాల్లో బీహార్, ఒడిశా, మహారాష్ట్ర ఉన్నాయి. ఈ ఆరు రాష్ట్రాల్లోనే 81 శాతం కేసులు నమోదయ్యాయి. ఇక మన రాష్ట్రం 2,190 కేసులతో ఏడో స్థానంలో ఉంది. ఎస్‌టిలపై వేధింపుల కేసులు దేశవ్యాప్తంగా 8,330 నమోదు కాగా, 379 కేసులతో రాష్ట్రం ఎనిమిదో స్థానంలో ఉంది. ఉమ్మడి కడప జిల్లాలోని 15 మండలాలు, విజయనగరం జిల్లాలో 15 గ్రామాలు సహా రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో అత్యధికంగా ఎస్‌సి, ఎస్‌టిలపై వేధింపులు జరుగుతున్నాయి. ఈ కేసులలో నిందితులు దర్జాగా తిరుగుతుండగా, బాధితులు బిక్కుబిక్కుమంటున్నారు. మొత్తంగా దళితులకు సంబంధించి 97.7 శాతం కేసులు 13 రాష్ట్రాల్లోనూ, అవే రాష్ట్రాల్లో ఎస్‌టిలపై 98.91 కేసులు నమోదయ్యాయి. ఈ విషయాలపై పెదవివిప్పని బిజెపి అగ్రనేత అమిత్‌షా గురివిందగింజ తన నలుపెరగదన్నట్టు ఇతర పార్టీల దళిత వ్యతిరేకత గురించి మాట్లాడుతున్నారు. దళితులు, గిరిజనులు, మైనారిటీలపై నిత్యం విషం చిమ్ముతూ సమాజంలో చీలికలు సృష్టించి లబ్ధి పొందాలని కాచుక్కూర్చున్న సంఘపరివార్, బిజెపి శక్తులకు గట్టిగా బుద్ధి చెప్పాలి. 'అన్నదమ్ముల వలెను జాతులు, మతములన్నీ మెలగవలెనోయి మతం వేరైతేను యేమోయి.. మనసు వొకటై మనుషులుంటే..' అన్న గురజాడ స్ఫూర్తితో ముందడుగు వేయడమే మన కర్తవ్యం.

# మోడీ దిగ్విజయ యాత్ర



మానవాళి విజయం యుద్ధక్షేత్రంలో కాదు.. సమష్టి శక్తిలోనే ఉందని ఐక్యరాజ్యసమితి వేదికపై నుంచి ప్రకటించడం ద్వారా ప్రపంచ శాంతికి భారత్ కట్టుబడి ఉన్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మరోసారి విస్పష్టంగా చెప్పారు. పలు దేశాలు యుద్ధాలతో, సంక్షోభాలతో, కలహాలతో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో ప్రధాని తన అమెరికా పర్యటనలో దాదాపు ప్రతి వేదికపైనా శాంతి సుస్థిరతలతోనే ప్రపంచం ముందుకు వెళ్తుందన్న విషయాన్ని పదేపదే నొక్కి చెప్పారు. అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, భారత్ సభ్యత్వ దేశాలుగా గల క్వాడ్ సదస్సులో పాల్గొనేందుకు అగ్రరాజ్యానికి బయల్దేరి వెళ్లిన ప్రధాని మోడీకి ఎప్పటిలాగే అపూర్వ స్వాగతం లభించింది. తన మూడు రోజుల పర్యటనలో అంతర్జాతీయ వేదికలపై ప్రసంగించడంతో పాటు వివిధ దేశాధినేతలతో టెక్నాలజీ, ఆర్థికాభివృద్ధి, ద్వైపాక్షిక సంబంధాలపై ప్రధాని ముఖాముఖీ ఫలవంతమైన చర్చలు జరిపారు. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తున్న భారత్‌కు మద్దతు ఇస్తామని అగ్రరాజ్యం హామీ ఇవ్వగా, వివిధ టెక్ దిగ్గజాలతో మోడీ జరిపిన భేటీలో పలువురు సిఇఒలు ప్రపంచంలోనే మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడం హర్షించదగిన మరొక పరిణామం. బైడెన్ తో మోడీ జరిపిన ద్వైపాక్షిక చర్చల్లో కోల్‌కతాలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ యూనిట్ నెలకొల్పేందుకు అంగీకారం కుదరడం గమనార్హం. ఇరుదేశాల మధ్య పరస్పర సాంకేతిక సహాయ సహకారాల వినిమయంలో భాగంగా ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు అగ్రరాజ్యం అంగీకరించింది. సైనిక దళాలు వినియోగించే సాంకేతిక పరికరాలలో వాడే చిప్స్ తయారీలో ఈ సెమీకండక్టర్ ప్రాజెక్టు కీలకమవుతుంది. మోడీ పర్యటనలో మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే- ఎప్పుడో అక్రమ మార్గాల ద్వారా తరలిపోయిన 297 ప్రాచీన కళాఖండాలను తిరిగి భారత్‌కు అగ్రరాజ్యం అప్పగించడం. ఢిల్లీలో గత జులైలో జరిగిన ప్రపంచ వారసత్వ కమిటీ సమావేశంలో సాంస్కృతిక కళాఖండాలను తిరిగి రప్పించడంపై అమెరికా -భారత్ కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఈ అప్పగింత జరిగింది. విల్మింగ్టన్‌లో జరిగిన క్వాడ్ సదస్సులో సైతం మోడీ ఉద్రిక్తతలు, సంఘర్షణలు ప్రపంచాన్ని చుట్టుముడుతున్నాయని ఆందోళన వ్యక్తపరిచారు. తనకు, పొరుగు దేశాలకు మధ్య విభేదాలు సృష్టించేందుకు 'విభజించు- పాలించు' అనే వ్యూహాన్ని క్వాడ్ సదస్సు అమలు చేస్తోందంటూ చైనా ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో క్వాడ్ సదస్సు ఎవరికీ వ్యతిరేకం కాదని ప్రధాని తేల్చిచెప్పారు. వాస్తవానికి క్వాడ్ సదస్సు ఈసారి ఇండియాలోనే జరగవలసి ఉండగా బైడెన్ అభ్యర్థన మేరకు వేదిక విల్మింగ్టన్‌కు మారింది. తన పర్యటనలో మూడోరోజు



ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ప్రసంగించిన మోడీ, మానవాళి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రపంచ నేతల చర్యలు ఉండాలని ఆకాంక్షించారు. 'ఒక భూగోళం- ఒక కుటుంబం- ఒక భవిష్యత్తు' అనే నినాదానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. యుద్ధ సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న ఉక్రెయిన్, పాలస్తీనా అధ్యక్షులతో సైతం ప్రధాని భేటీ కావడం విశేషం. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీతో మోడీ భేటీ కావడం నెల రోజుల వ్యవధిలో ఇది రెండోసారి కాగా, ఈ ఏడాదిలో మూడోసారి. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు భారత్ కట్టుబడి ఉందని మరోసారి పునరుద్ఘాటించిన మోడీ, రష్యా- ఉక్రెయిన్ దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధాన్ని నిలువరించే దిశగా శాంతియుత పరిష్కారాన్ని కనుగొనడంలో భారత్ సహకరిస్తుందని హామీ ఇచ్చారు. తన పర్యటనలో వివిధ దేశాధినేతలతో భేటీ అయిన ప్రధాని.. అమెరికా ఎన్నికలలో పోటీ పడుతున్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలవకపోవడానికి కారణం ఆ దేశ రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకోవడమే కారణం కావచ్చు. కేంద్రంలో మూడోసారి అధికార పగ్గాలు చేపట్టిన ఎన్‌డిఎ ప్రభుత్వం స్వతంత్ర విదేశాంగ విధానానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందనడానికి మోడీ ఇటీవలి కాలంలో రష్యా, ఉక్రెయిన్, అమెరికాలలో జరిపిన పర్యటనలు, సాధించిన విజయాలే ఉదాహరణలు. వివిధ దేశాలతో సంబంధ బాంధవ్యాలను పటిష్టపరచుకోవడంలో ప్రధాని కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టీ 'భారత దేశ చరిత్రలో అమెరికాకు బాగా దగ్గరైన ప్రధాని మోడీ, అమెరికా చరిత్రలో భారత్ కు బాగా దగ్గరైన అధ్యక్షుడు బైడెన్' అంటూ చేసిన వ్యాఖ్యలు అక్షర సత్యాలు!